జాతీయ తెలుగు దినపత్రిక

# తెలంగాణ

ప్రతి వార్త సంచలనం





హైదరాబాద్, విజయవాడ | శుక్రవారం | 17-04-2026 | పేజీలు : 6




2లో

## మహిళా రిజర్వేషన్ బిల్లుతో ఎవరికీ నష్టం లేదు, మహిళలకు 272 సీట్లు లభిస్తాయి: కేంద్రమంత్రి

- మహిళా రిజర్వేషన్‌తో ఏ రాష్ట్రానికి, ఏ పురుషుడికి అన్యాయం జరగదన్న కేంద్రమంత్రి
- పార్లమెంటు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు అన్న అర్జున్ రామ్ మేఘ్ వాల్
- లోక్ సభ స్థానాలు 50 శాతం పెంచేలా నిర్ణయం తీసుకున్నామన్న కేంద్రమంత్రి

## కేరళలో లోక్ సభ స్థానాలను తగ్గించమని రేవంత్ రెడ్డి కోరాలి: రాంచందర్ రావు



2లో

- కేరళలో 20 లోక్ సభ స్థానాలు ఉంటే తెలంగాణలో 17 ఉన్నాయన్న రాంచందర్ రావు
- ముందు కేరళలో సీట్లు తగ్గించాలని అడగాలని సవాల్
- కాంగ్రెస్ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాలకు తక్కువ సీట్లు ఇచ్చిందని ఆరోపణ



2లో

## అమెరికా నౌకలను హర్మూజ్‌లోనే ముంచేస్తాం

– ఓడరేవులను ముట్టడిస్తే ఖబడ్దార్'





2లో

## ఆ బిల్లులు దురుద్దేశపూరితమైనవి- కొన్ని రాష్ట్రాలకు అపారమైన నష్టం : కాంగ్రెస్

# తెలంగాణలో టాప్ 3 కులాలు ఇవే...

# నివేదిక విడుదల చేసిన ప్రభుత్వం

- తెలంగాణ కుల సర్వే అధికారిక గణంకాలను విడుదల చేసిన ప్రభుత్వం
- రాష్ట్రంలో 56.36 శాతంతో బీసీలదే అగ్రస్థానం అని వెల్లడి
- జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో ఓసీల్లో రెడ్డి, ఎస్టీల్లో లంబాడీల జనాభా అత్యధికం
- దాదాపు 4 శాతం మంది ప్రజలు తమకు కులం లేదని వెల్లడించిన వైనం

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వేకు సంబంధించిన అధికారిక గణంకాలను విడుదల చేసింది. ఈ సర్వే ప్రకారం రాష్ట్ర జనాభాలో వెనుకబడిన తరగతులు (బీసీలు) 56.36 శాతంతో అతిపెద్ద సామాజిక వర్గంగా నిలిచారు. జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. దేశంలోనే ఆదర్శవంతంగా, అత్యంత పారదర్శకంగా ఈ సర్వే ప్రక్రియను పూర్తి చేశామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ భారీ కసరత్తు కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.03 లక్షల మంది ప్రభుత్వ సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేశారు. ప్రజల నుంచి 'సెల్ఫ్ డిక్లరేషన్' పద్ధతిలో వివరాలను సేకరించారు. ఈ సర్వేలో భాగంగా మొత్తం 1,12,36,849 కుటుంబాలను సర్వే బృందాలు సందర్శించి, 3,55,50,759 మంది జనాభా వివరాలను నమోదు చేసినట్లు ప్రభుత్వం అధికారిక ప్రకటనలో తెలిపింది.

### సామాజిక వర్గాల వారీగా జనాభా వాటా

సర్వే ఫలితాల ప్రకారం, రాష్ట్ర జనాభాలో బీసీల తర్వాత షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు) 17.42 శాతం, అగ్రవర్ణాలు (ఓసీలు) 15.79 శాతం, షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు) 10.43 శాతం చొప్పున ఉన్నారు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సుమారు 4 శాతం మంది ప్రజలు తమకు ఎలాంటి కులం లేదని (No Caste) తమ డిక్లరేషన్‌లో పేర్కొనడం గమనార్హం.

### కులాల వారీగా ప్రధాన వర్గాలు

రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన కులాల జాబితాను పరిశీలిస్తే, 36.58 లక్షల మందితో (10.3 శాతం) మాదిగ సామాజిక వర్గం మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత 27.96 లక్షల మందితో (7.9 శాతం) షేక్ ముస్లింలు రెండో స్థానంలో, 26.39 లక్షల జనాభాతో (7.4 శాతం) ముదిరాజ్ సామాజిక వర్గం మూడో స్థానంలో ఉన్నాయి. ఓసీ వర్గాల్లో: రెడ్డి సామాజిక వర్గం 4.8

మిగతా 2లో

## దేశ పార్లమెంటరీ చరిత్రలో ఈరోజును మరిచిపోలేం- దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు

- మహిళలకు అవకాశం ఇస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారన్న ప్రధాని మోదీ
- మహిళల బిల్లు విషయంలో అందరూ కలిసి రావాలని పిలుపు



మహిళా రిజర్వేషన్ల అమలు కోసం తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై చర్చలో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్ లక్ష్య సాధనలో మహిళల పాత్ర చాలా కీలకమని వివరించారు. మహిళలకు అవకాశం ఇస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారని పేర్కొన్నారు. గతంలో మహిళా రిజర్వేషన్ల బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు ఇచ్చిన విషయం గుర్తుచేసిన ప్రధాని రిజర్వేషన్లను త్వరగా అమలుచేసేందుకు చేస్తున్న ప్రయత్నానికి ఇప్పుడు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మహిళా బిల్లును వ్యతిరేకించే వారిని మహిళలు క్షమించరన్న ప్రధాని మోదీ, సమయం చూసి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. దేశ పార్లమెంటరీ చరిత్రలో ఈరోజును మరిచిపోలేమన్న మోదీ, ఈ చారిత్రక సమయంలో పాలుపంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నాని అన్నారు. దేశ రాజకీయాల్లో మహిళల పాత్ర కీలకమని, వారిని కలుపుకుని ముందుకెళ్తున్నామని చెప్పారు. మహిళలకు

మిగతా 2లో




2లో

## రాజ్యసభ సభ్యుడిగా వేం నరేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం

- తనపై నమ్మకంతో కాంగ్రెస్ అవకాశం ఇచ్చిందన్న నరేందర్ రెడ్డి
- తెలంగాణ హక్కులపై సభలో పోరాటం చేస్తానని వెల్లడి
- ప్రమాణ స్వీకారం చేసిన కొత్తగా ఎన్నికైన సభ్యులు

## లోక్‌సభ ముందుకు మూడు బిల్లులు- వాడీవేడి చర్చ

- బిల్లులపై సభ్యులు ఎన్ని గంటలు కోరినా చర్చ జరపవచ్చు: లోక్‌సభ స్పీకర్
- డీలిమిటేషన్ బిల్లు ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించిన విపక్షాలు



2లో



3లో

## 40ఏళ్లుగా ఇజ్రాయెల్ యుద్ధం కోసం ప్రయత్నిస్తోంది- ఇప్పుడు అమెరికాను ఒప్పించగలిగింది: ఇరాన్

- నెతన్యాహూ దశాబ్దాలుగా ఇరాన్‌పై యుద్ధానికి ప్రయత్నించారని ఆరోపణ
- అమెరికా-ఇజ్రాయెల్ చర్యలపై ఇరాన్ ప్రతినిధి తీవ్ర విమర్శలు
- చర్చలు సీరియస్‌గా జరగలేదని వ్యాఖ్య

## తెలంగాణ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే ప్రజలు రోడ్లపైకి వస్తారు: కవిత

- డీలిమిటేషన్ లో తెలంగాణకు అన్యాయం జరగకుండా చూడాలన్న కవిత
- రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టీకరణ
- దక్షిణాది రాష్ట్రాలను డీలిమిటేషన్ పేరుతో శిక్షించడం సరికాదని వ్యాఖ్య



3లో

# తెలంగాణలో టాప్ 3 కులాలు ఇవే... నివేదిక విడుదల చేసిన ప్రభుత్వం

శాతం వాటాతో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో కోమటి (1.4 శాతం), కమ్మ (1.0 శాతం), బ్రాహ్మణ (0.9 శాతం), కాపు/నాయుడు (0.7 శాతం), వెలమ (0.4 శాతం) ఉన్నారు.
బీసీ వర్గాల్లో: షేక్ ముస్లింలు (7.9 శాతం) అత్యధిక జనాభాతో ముందుండగా, ముదిరాజ్ (7.4 శాతం), యాదవ (5.7 శాతం), గౌడ్ (4.6 శాతం), మున్నూరుకాపు (3.9 శాతం) తర్వాతి స్థానాల్లో నిలిచారు. ఎస్సీ వర్గాల్లో: మాదిగ (10.3 శాతం) సామాజిక వర్గం అత్యధిక జనాభా కలిగి ఉండగా, మాల (4.1 శాతం), బేడా (0.5 శాతం), మాల సేల్ (0.5 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.
**ఎస్టీ వర్గాల్లో:** లంబాడీలు 6.8 శాతం జనాభాతో అగ్రస్థానంలో నిలిచారు. కోయ (1.2 శాతం), గోండ్ (1.1 శాతం), ఎరుకుల (0.5 శాతం) వారి తర్వాత ఉన్నారు. ఈ సర్వే ద్వారా వెల్లడైన గణంకాలు భవిష్యత్తులో ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాల రూపకల్పన, రాజకీయ సమీకరణాల్లో కీలక పాత్ర పోషించనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.
రాష్ట్రంలో ఎస్సీ దక్కలి కులం అత్యధికంగా, కాపు కులం అతి తక్కువగా వెనకబడి ఉన్నట్లు స్వతంత్ర నిపుణుల కమిటీ విశ్లేషించింది. ఎస్సీ, ఎస్టీలు ఓసీల కన్నా సుమారు మూడు రెట్లు వెనకబడి ఉన్నట్లు తెలిపింది. సుమారు 67 శాతం జనాభా, రాష్ట్ర సగటు కన్నా ఎక్కువ వెనకబాటు తనంతో ఉన్నట్లు వివరించింది. ఎస్టీల్లో 99 శాతం, ఎస్సీల్లో 97 శాతం, బీసీల్లో 71 శాతం రాష్ట్ర సగటు కన్నా వెనకబడి ఉన్నారని, ఇది కులాల మధ్య అసమానతలను స్పష్టంగా వెల్లడిస్తోందని కమిటీ పేర్కొంది.
**గతేడాదిలో నిపుణుల కమిటీ ఏర్పాటు :** రాష్ట్ర ప్రభుత్వం చేసిన సీపెక్ సర్వే ఆధారంగా స్వతంత్ర నిపుణుల కమిటీ పలు ఆసక్తికర విశ్లేషణలతో పాటు ప్రభుత్వానికి కీలక సిఫార్సులు చేసింది. సీపెక్ సర్వేను అధ్యయనం చేసి, సిఫార్సులు చేసేందుకు జస్టిస్ సుదర్శన్ రెడ్డి నేతృత్వంలో స్వతంత్ర నిపుణుల కమిటీని గతేడాది మార్చి 12న రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఐదు సమావేశాలు నిర్వహించిన నిపుణుల కమిటీ, గతేడాది జులై 19న ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. సామాజిక, ఆర్థిక పరిస్థితులను పరిగణలోకి తీసుకొని 8 విభాగాల్లో 42 పారామీటర్ల ఆధారంగా కులాల వారీగా వెనకబాటు తనాన్ని అంచనా వేసింది. ఎక్కువ స్కోరు ఉంటే ఎక్కువ వెనకబడినట్లుగా పేర్కొంది.
**116 పాయింట్లతో అత్యంత వెనకబడిన ఎస్సీ దక్కలి :** దాని ప్రకారం రాష్ట్రంలో 116 పాయింట్లతో ఎస్సీ దక్కలి కులం అత్యంత వెనకబడిందని, 12 పాయింట్లతో కాపు కులస్థులు అతి తక్కువగా వెనకబడినట్లు విశ్లేషించింది. ఎస్సీలు 96 పాయింట్లతో వెనకబడి ఉండగా, ఎస్టీలు 95 పాయింట్లతో, బీసీలు 86, ఓసీలు 31 స్కోరుతో ఆ తర్వాత వరుసలో ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీలు ఓసీ కులాల కన్నా సుమారు మూడు రెట్లు వెనకబడి ఉన్నట్లు కమిటీ విశ్లేషించింది. ఉన్నత విద్య, ఆంగ్ల మాధ్యమంలో ఓసీ కులాల కన్నా ఎస్సీ, ఎస్టీ, బీసీలు వెనకబడి ఉన్నట్లు పేర్కొంది.
ఎస్సీ, ఎస్టీలు ఎక్కువగా రోజువారీ కూలీ, వ్యవసాయ పనులు చేస్తుండగా, జనరల్ కులాలు వ్యాపార, వృత్తిపరమైన ఉద్యోగాల్లో ఆధిపత్యంలో ఉన్నట్లు కమిటీ వివరించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీలు తక్కువ స్థాయి జీవన ప్రమాణాలతో నివసిస్తున్నారని పేర్కొంది. జనరల్ కులాల వారికి మెరుగైన నాణ్యత గల భూములు, ఆస్తులు ఉన్నట్లు నివేదించింది.
**ఎక్కువగా లబ్ధి పొందుతున్న ఓసీలు :** సుమారు లక్ష కోట్లకు పైగా ఖర్చు చేస్తున్న 11 పథకాలను స్వతంత్ర నిపుణుల కమిటీ విశ్లేషించగా, సుమారు 30 శాతం మంది లబ్ధిదారులు మాత్రమే రాష్ట్ర సగటు కన్నా తక్కువ వెనకబాటు తనంతో ఉన్నారని కమిటీ వెల్లడించింది.
ఎస్సీ, ఎస్టీలు ఉచిత గృహ పథకాలు, మహిళలు ఉచిత బస్సు ప్రయాణం పథకాల్లో ఎక్కువగా లబ్ధి పొందుతున్నారని తెలిపింది. రైతు భరోసా, రైతు భీమా, ఉచిత విద్యుత్ వంటి వ్యవసాయ పథకాల్లో ఎక్కువగా ఓసీలు లబ్ధి పొందుతున్నట్లు వివరించింది.
**వెనకబాటు తనంతో 107 కులాలు :** రాష్ట్ర సగటు స్కోరును 81గా పేర్కొన్న కమిటీ, మొత్తం 242 కులాలు 135 సగటు కన్నా ఎక్కువ స్కోరుతో వెనకబడి ఉన్నాయని తెలిపింది.
వాటిలో 69 బీసీ, 41 ఎస్సీ, 25 ఎస్టీ కులాలు ఉన్నాయని, రాష్ట్ర జనాభాలో 67 శాతం ఉన్నట్లు వివరించింది. రాష్ట్ర సగటు కన్నా తక్కువ వెనకబాటు తనంతో 107 కులాలు ఉన్నాయని, వాటిలో 64 బీసీలు, 18 ఎస్సీ, ఏడు ఎస్టీ కులాలు ఉన్నట్లు కమిటీ వెల్లడించింది. ఎస్టీల్లో 99 శాతం, ఎస్సీల్లో 97 శాతం, బీసీల్లో 71 శాతం రాష్ట్ర సగటు కన్నా వెనకబడి ఉన్నారని, ఇది కులాల మధ్య అసమానతలను స్పష్టంగా వెల్లడిస్తోందని పేర్కొంది.
**స్వతంత్ర నిపుణుల కమిటీ సిఫార్సు :** రాష్ట్రంలోని 4 శాతం అంటే సుమారు 14 లక్షల మంది తమది ఏ కులం కాదని సర్వేలో చెప్పారు. ఎక్కువగా హైదరాబాద్‌లోని తక్కువ వెనకబాటుతనం ఉన్న వర్గాలకు చెందిన విద్యా వంతులు, ఉద్యోగులు తమకు కులం లేదని పేర్కొన్నారు. అయితే సర్వేలో తమది నో కాస్ట్ అని చెప్పిన వారిలో దాదాపు 43.3 శాతం మంది వద్ద కుల ధ్రువీకరణ పత్రాలు ఉన్నట్లు కమిటీ విశ్లేషించింది. జనాభా ప్రాతిపదికన కాకుండా వెనకబాటు తనం ఆధారంగా సామాజిక న్యాయం జరగాలని స్వతంత్ర నిపుణుల కమిటీ సిఫార్సు చేసింది. కులాల వెనకబాటు తనం ప్రామాణికంగా సంక్షేమ విధానాలు రూపొందించాలని తెలిపింది.

# దేశ పార్లమెంటరీ చరిత్రలో ఈరోజును మరిచిపోలేం - దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు : ప్రధాని మోదీ

అవకాశం ఇస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారని కొనియాడారు. "ఎవరైతే రాజకీయ కోణంలోనే ఆలోచిస్తారో, నేను వారికి ఒక సలహా ఇవ్వాలనుకుంటున్నా. ఒక మిత్రుడిగా సలహా ఇస్తున్నాను. ఇది అందరికీ ఉపయోగపడుతుంది. మహిళా బిల్లును వ్యతిరేకించే వారిని మహిళలు క్షమించరు. మన దేశంలో ఎప్పటి నుంచి అయితే మహిళా రిజర్వేషన్ల చర్చ జరిగిందో, ఆ తర్వాత ఎప్పుడెప్పుడు ఎన్నికలు వచ్చాయో, ప్రతి ఎన్నికల్లోనూ మహిళలకు లభించే ఈ హక్కును ఎవరెవరైతే వ్యతిరేకించారో, దేశంలోని మహిళలు వారిని క్షమించలేదు. వారి పరిస్థితి అధ్వాన్నం కంటే అధ్వాన్నంగా మార్చారు. 2024 ఎన్నికల్లో మాత్రం అలా జరగలేదు. ఎందుకు జరగలేదు? ఎందుకంటే 2024లో అందరూ ఏకాభిప్రాయంతో దీనిని ఆమోదించారు. కాబట్టి ఇది ఒక అంశంగానే మిగలలేదు. ఎవరి పక్షాన రాజకీయ లబ్ధి కలగలేదు. ఎవరికీ నష్టం కూడా కలగలేదు. సహజ సిద్ధంగా ఏయే అంశాలు ఉన్నాయో ఆ అంశాల ఆధారంగానే ఎన్నికలు జరిగాయి. ఎందుకంటే 2024లో అందరూ కలిసి ఉన్నారు. చరిత్ర సాక్షిగా ఈ రోజు కూడా నేను ఒకటి చెబుతున్నాను. ఒకవేళ మనం అందరం కలిసి ఈ నిర్ణయం తీసుకుంటే అది ఏ ఒక్క పార్టీ విజయం కాకుండా దేశ ప్రజాస్వామ్యానికే గొప్ప విజయంగా మారుతుంది."
**డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు : మోదీ**
మహిళా బిల్లుపై కొందరు ఉత్తరాది, దక్షిణాది అంటూ విభజన రాజకీయాలు చేస్తున్నారని ప్రధాని మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదని తేల్చిచెప్పారు. చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం అనే భేదాలు మాకు లేవని స్పష్టం చేశారు. "దేశం విషయంలో మనమంతా ఒక్కటవ్వాలి. దేశానికి మేలు చేసే ప్రతి విషయంలో సభ్యులంతా కలవాలి. ఈ బిల్లు తీసుకురాగానే కొందరు విభజన రాజకీయాలు చేస్తున్నారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ విభజన తీసుకువస్తున్నారు. విభజన రాజకీయాలు చేసే వారిని ప్రజలు ఇప్పటికే దూరం పెట్టారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు. చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం అనే భేదాలు మాకు లేవు. ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదని హామీ ఇస్తున్నాం. ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని వాగ్దానం చేస్తున్నాం. అనేక పార్టీలు మహిళల హక్కులను ఇన్నాళ్లూ అడ్డుకున్నాయి. దాన్ని గుర్తించే మేం ఇప్పుడు మహిళలకు వారి హక్కులు కల్పిస్తున్నాం. అనేక కారణాలు చూపించి గతంలో మహిళా బిల్లును అడ్డుకున్నారు. సాంకేతిక కారణాలు చూపించి 30 ఏళ్లపాటు మహిళా బిల్లును అడ్డుకున్నారు. మహిళా బిల్లుకు పార్టీలన్నీ ఏకగ్రీవంగా మద్దతివ్వాలి. మహిళలు తమ హక్కులపై 30 ఏళ్లుగా గొంతు విప్పుతున్నారు. క్షేత్రస్థాయిలో మహిళలు 30 ఏళ్లుగా పోరాడుతున్నారు. రాజకీయాల్లో శక్తిసామర్థ్యాలు చూపించేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. ఎవరికైనా అవకాశం ఇస్తేనే కదా వారి సామర్థ్యం తెలుస్తుంది. మహిళా బిల్లుకు మద్దతిచ్చే పార్టీలకే మనుగడ ఉంటుంది. దేశ రాజకీయాల్లో, వివిధ రంగాల్లో మహిళలను కలుపుకుని వెళ్లాల్సిందే. దేశ ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నాం. మహిళల పురోగతిని కొన్ని పార్టీలు ఎందుకు అడ్డుకుంటున్నాయి? మహిళల శక్తిసామర్థ్యాలు తెలుసు కనుకే వారిని ప్రోత్సహిస్తున్నాం. మహిళా బిల్లు క్రెడిట్ మేం మాత్రమే తీసుకోం. మహిళా బిల్లు క్రెడిట్ అందరికీ దక్కుతుంది. మహిళా బిల్లుపై అన్ని పార్టీల నేతల ఫొటోలూ వేసుకోండి."
**మహిళల స్వావలంబన కూడా ఉంటేనే అది సంపూర్ణ వికసిత్ భారత్ : మోదీ**
"మహిళా రిజర్వేషన్ బిల్లు దేశ చరిత్రలోనే గొప్ప బిల్లు. 30 ఏళ్లపాటు ప్రయత్నాలు జరిగినా గతంలో ఇది సాకారం కాలేదు. చారిత్రక సందర్భంగా భాగం కావటం అదృష్టంగా భావిస్తున్నా. ఈ బిల్లు దేశ దశ, దిశను మార్చనుంది. వికసిత్ భారత్ అంటే రోడ్లు, రైళ్లు, మౌలిక సదుపాయాలు మాత్రమే కాదు. మహిళల స్వావలంబన కూడా ఉంటేనే అది సంపూర్ణ వికసిత్ భారత్. మహిళా రిజర్వేషన్ బిల్లును దేశప్రజలంతా స్వాగతిస్తున్నారు. ఈ బిల్లును తేవటంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదు. ఇది రాజకీయ పార్టీల కోసం తెచ్చింది కాదు దేశ ప్రజల కోసం తెచ్చిన బిల్లు. 30 ఏళ్ల క్రితమే మహిళా బిల్లు తెచ్చామంటున్నారు మరి ఎవరికైనా మేలు జరిగిందా? గ్రామీణస్థాయిలో రిజర్వేషన్ల వల్ల మహిళలకు రాజకీయ అవగాహన వచ్చింది. గ్రామీణ స్థాయిలో మహిళలు ఇప్పటికే నాయకులుగా రాణిస్తున్నారు. ఒక్కసారి 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చి చూస్తే మహిళా శక్తి ఏంటో చూస్తారు." అని ప్రధాని మోదీ అన్నారు

## కేరళలో లోక్ సభ స్థానాలను తగ్గించమని రేవంత్ రెడ్డి కోరాలి: రాంచందర్ రావు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు సవాల్ విసిరారు. కేరళలో 20 లోక్ సభ స్థానాలు ఉంటే, తెలంగాణలో 17 మాత్రమే ఉన్నాయని గుర్తు చేశారు. మొదట కేరళలో లోక్ సభ సీట్లను తగ్గించాలని రేవంత్ రెడ్డి అడగాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాలకు తక్కువ సీట్లు ఇచ్చారని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్‌లు అమలు చేయాలని, డీలిమిటేషన్ చేపట్టాలని లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ కొత్త పార్లమెంటు భవనంలోనే కోరారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు వారే వ్యతిరేకిస్తున్నారని మండిపడ్డారు. 543 సీట్లలోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని కాంగ్రెస్ ఇప్పుడు కోరడం విడ్డూరంగా ఉందని అన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో కుటుంబ నియంత్రణ పాటించడం వల్ల జనాభా తగ్గిందని, ఉత్తరాదిన పాటించలేదని రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి వింత వాదన చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుతో ఎవరికీ నష్టం లేదు, మహిళలకు 272 సీట్లు లభిస్తాయి: కేంద్రమంత్రి

మహిళా రిజర్వేషన్ బిల్లుతో ఎవరికీ నష్టం జరగదని, ఈ బిల్లు ద్వారా లోక్ సభలో మహిళలకు 272 సీట్లు లభిస్తాయని కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘ్ వాల్ తెలిపారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు వీలుగా కేంద్రం మూడు బిల్లులను లోక్ సభలో ప్రవేశపెట్టింది. అనంతరం వీటిపై చర్చ ప్రారంభించారు. అర్జున్ రామ్ మేఘ్ వాల్ మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్ల అమలుతో ఏ రాష్ట్రానికి లేదా ఏ పురుషుడికి నష్టం జరగబోదని స్పష్టం చేశారు. పార్లమెంటు చరిత్రలో ఇది సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు అన్నారు. మహిళా రిజర్వేషన్లను అమలు చేయాల్సిన సమయం వచ్చిందని ఆయన వ్యాఖ్యానించారు. కొన్ని బిల్లులను భవిష్యత్తు తరాలు మరవలేవని, అందులో ఈ బిల్లు ఉంటుందని అన్నారు. ఆర్టికల్ 368 ద్వారా ప్రజలకు ఉపయోగకరమైన నిర్ణయాలు తీసుకోవడానికి పార్లమెంటుకు రాజ్యాంగం శక్తిని ఇచ్చిందని అన్నారు. అందులో భాగంగానే మూడు బిల్లులను ప్రవేశపెట్టామని తెలిపారు. లోక్ సభ స్థానాలను 50 శాతం పెంచేలా నిర్ణయం తీసుకున్నామని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో పార్లమెంటులో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుందని అన్నారు. లోక్ సభ స్థానాలు 815కు పెరుగుతాయని, అప్పుడు మహిళలకు 272 స్థానాలు వస్తాయని అన్నారు. మహిళల కోటాలోనే ఎస్సీ, ఎస్టీలకు ఉపకోటా లభిస్తుందని తెలిపారు.

## 'అమెరికా నౌకలను హర్మూజ్‌లోనే ముంచేస్తాం- ఓడరేవులను ముట్టడిస్తే ఖబడ్దార్'

- ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్
- హర్మూజ్‌లో పోలీస్‌గా మారేందుకు ట్రంప్ యత్నం
- మా ఓడరేవులను ముట్టడిస్తే తీవ్ర పర్యవసానాలు
- మాపై భూతల దండయాత్ర చేస్తే మరీ మంచిది
- అమెరికన్ సైనికులను బంధించి బిలియన్ల వసూలు చేస్తామన్న ఇరాన్

ఒకవేళ హర్మూజ్ జలసంధికి పహారా ఇవ్వాలని అమెరికా డిసైడ్ అయితే, ఆ దేశపు నౌకలను హర్మూజ్‌లోనే ముంచేస్తామని ఇరాన్ సుప్రీం లీడర్ ముజ్తబా ఖమేనీ సైనిక సలహాదారు మొహ్సిన్ రజాయీ హెచ్చరించారు. హర్మూజ్ మార్గంలో పోలీస్‌గా మారాలని ట్రంప్ భావిస్తున్నారని, అమెరికా ప్రెసిడెంట్ చేయాల్సిన పని ఇదేనా అని ఆయన ప్రశ్నించారు. అమెరికా లాంటి శక్తివంతమైన సైన్యం చేసే పని ఇదేనా అని మొహ్సిన్ రజాయీ పేర్కొన్నారు. అమెరికా నౌకలు హర్మూజ్‌లోకి ప్రవేశించగానే వాటిని తమ మిస్సైళ్లు ముంచేస్తాయన్నారు. దీంతోపాటు గల్ఫ్‌లో అమెరికా సైన్యం తీవ్ర ముప్పును ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. కచ్చితంగా అమెరికా నౌకలను ధ్వంసం చేసే శక్తిసామర్థ్యాలు ఇరాన్ మిస్సైళ్లకు ఉన్నాయని తేల్చి చెప్పారు. సైనిక యూనిఫాంలో ఇరాన్ ప్రభుత్వ టీవీ ఛానల్‌తో మాట్లాడుతూ మొహ్సిన్ రజాయీ ఈ వ్యాఖ్యలు చేశారు.
**మాపై భూతల దండయాత్ర చేస్తే మరీ మంచిది :**
"ఒకవేళ ఇరాన్‌పై అమెరికా భూతల దండయాత్రను మొదలుపెడితే, అది మరీ మంచి విషయం. ఎందుకంటే మేం వేలాది మంది అమెరికన్ సైనికులను బందీలుగా చేసుకుంటాం. అనంతరం ఒక్కో అమెరికన్ సైనికుడిని విడుదల చేయడానికి బిలియన్ల కొద్దీ డాలర్లను అమెరికా నుంచి వసూలు చేస్తాం.
నేనైతే అమెరికాతో కాల్పుల విరమణను పొడిగించడానికి అస్సలు అనుకూలంగా లేను. అయితే ఇది నా వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే" అని మొహ్సిన్ రజాయీ వ్యాఖ్యానించారు.
**అతివాది మొహ్సిన్ రజాయీ :** ప్రస్తుతం ఇరాన్ సుప్రీం లీడర్ ముజ్తబా ఖమేనీకి సైనిక సలహాదారుగా వ్యవహరిస్తున్న మొహ్సిన్ రజాయీపై అతివాది అనే ముద్ర ఉంది. 1981 నుంచి 1997 వరకు ఆయన ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్‌కు సారథిగా వ్యవహరించారు. అయతుల్లా అలీ ఖమేనీ కుటుంబంతోనూ మొహ్సిన్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అందుకే ఆయన్ను తన సలహాదారుగా ముజ్తబా నియమించుకున్నట్లు సమాచారం.
**తీవ్ర పర్యవసానాలుంటాయ్- ఓడరేవులను అమెరికా ముట్టడిస్తే ఖబడ్దార్ :** తమ ఓడరేవులను ముట్టడించే కవ్వింపు చర్యకు పాల్పడుతున్నందుకు అమెరికా తీవ్ర పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చి హెచ్చరించారు. తాజాగా చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో టెలిఫోన్ సంభాషణలో ఈవిషయాన్ని ఆయన తెలిపారు. హర్మూజ్ జలసంధి మార్గం, పర్షియన్ గల్ఫ్‌లలో అమెరికా చేస్తున్న చర్యల వల్ల ఇప్పటికే సున్నితంగా ఉన్న పరిస్థితులు మరింత సమస్యాత్మకంగా మారే ముప్పు ఉందన్నారు. హర్మూజ్‌ను తెరిపించడంపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో అమెరికా ప్రతిపాదించిన తీర్మానం అహేతుకమైంది, ఏకపక్షమైందని అరాగ్చి స్పష్టం చేశారు. ఈ తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేసినందుకు చైనా, రష్యాలను ఆయన కొనియాడారు. ఆ రెండు దేశాల వైఖరి పశ్చిమాసియాలో సైనిక ఉద్రిక్తతలు మరింత పెరగకుండా అడ్డుకుందన్నారు. ఈమేరకు వివరాలతో ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ బ్రాడ్‌కాస్టింగ్ (ఐఆర్ఐబీ) ఓ కథనాన్ని ప్రచురించింది.
**ఇరాన్ ప్రతిఘటనను కొనియాడిన చైనా :** ఐఆర్ఐబీ కథనం ప్రకారం, అమెరికా-ఇజ్రాయెల్‌లతో పోరాటంలో ఇరాన్ చూపిన సైనిక ప్రతిఘటనను, ఆత్మ విశ్వాసాన్ని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ కొనియాడారు. పశ్చిమాసియాలోని ఈ సైనిక ఉద్రిక్తతలను తగ్గించడానికి దౌత్యపరమైన సాయం చేసేందుకు చైనా సదా సిద్ధంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఇక మరో ఫోన్ కాల్‌లో జపాన్ విదేశాంగ మంత్రి తొషిమిత్సు మొతేగితోనూ అబ్బాస్ అరాగ్చి సంభాషించారు. ప్రాంతీయ, ద్వైపాక్షిక అంశాలపై వారు చర్చించారు. పశ్చిమాసియా సైనిక ఉద్రిక్తతలతో ముడిపడిన భద్రతాపరమైన, ఆర్థికపరమైన పర్యవసానాలపై డిస్కస్ చేశారు. అమెరికా, ఇజ్రాయెల్ దుందుడుకు వైఖరి వల్లే ఈ సైనిక ఉద్రిక్తతకు బీజాలు పడ్డాయని, వాటి వల్లే యుద్ధం మొదలైందని జపాన్ విదేశాంగ మంత్రికి అరాగ్చి తెలిపారు. ఈ ఉద్రిక్తతలను తగ్గించడానికి అన్ని ప్రపంచ దేశాలు బాధ్యతాయుత వైఖరితో నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఈ ఉద్రిక్తతలను తగ్గించే దౌత్యంలో భాగం కావడానికి జపాన్ సిద్ధంగా ఉందని అరాగ్చికి తొషిమిత్సు మొతేగీ తెలిపారు. కాగా, ఇరాన్ ఓడరేవులకు రాకపోకలను పూర్తిగా ఆపడంలో కేవలం 36 గంటల్లోనే తాము సఫలమయ్యామని పేర్కొంటూ బుధవారం రోజు అమెరికా ఆర్మీ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఈనేపథ్యంలో ఇరాన్ విదేశాంగ మంత్రి అరాగ్చితో జపాన్, చైనా విదేశాంగ మంత్రుల సంభాషణ ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.
**అమెరికా, ఇజ్రాయెల్‌లకు పశ్చిమాసియా భద్రతపై పట్టింపు లేదు**
పశ్చిమాసియా భద్రత గురించి అమెరికా, ఇజ్రాయెల్‌లకు ఏమాత్రం పట్టింపు లేదని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘయీ విమర్శించారు. ఆ రెండు దేశాల వల్లే పశ్చిమాసియాలో అనిశ్చితి, అస్థిరత ఏర్పడుతున్నాయని ఆయన తెలిపారు. అమెరికా, ఇజ్రాయెల్ వల్లే పశ్చిమాసియా దేశాల మధ్య అసమ్మతి, విభజన జరుగుతోందన్నారు. గత 40 రోజుల యుద్ధంలోనూ ఇదే విషయం తేలిందని ఇస్మాయిల్ బఘయీ పేర్కొన్నారు. ఇకనైనా ఇరాన్‌పై దాడుల కోసం అమెరికాకు భూభాగాన్ని ఇవ్వడాన్ని ఆపాలని పశ్చిమాసియా దేశాలను ఆయన కోరారు. ఇరాన్‌లోని మౌలిక సదుపాయాలపై దాడుల కోసం పశ్చిమాసియా దేశాల సైనిక స్థావరాలు, భూమి, సముద్రం, గగనతలాలను అమెరికా, ఇజ్రాయెల్ వాడుకున్నాయని ఆరోపించారు. అయినప్పటికీ పశ్చిమాసియా దేశాలతో తాము స్నేహసంబంధాలనే కోరుకుంటున్నామని, ఇందుకోసం అన్ని దేశాలు సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను పరస్పరం గౌరవించుకోవాల్సి ఉంటుందని ఇస్మాయిల్ బఘయీ సూచించారు. కనీసం ఇప్పటికైనా అమెరికా, ఇజ్రాయెల్‌లకు మద్దతు ఇవ్వడాన్ని ఆపాలని గల్ఫ్ దేశాలకు హితవు పలికారు.

## ఆ బిల్లులు దురుద్దేశపూరితమైనవి- కొన్ని రాష్ట్రాలకు అపారమైన నష్టం : కాంగ్రెస్

- పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో భాగంగా లోక్‌సభ ముందుకు మూడు ప్రధాన బిల్లులు
- ఈ బిల్లుల వల్ల పలు రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని కాంగ్రెస్ మండిపాటు
- వీటిపై ప్రతిపక్షానికి తీవ్రమైన ఆందోళనలు ఉన్నాయని వెల్లడి

మహిళా రిజర్వేషన్లను అమల్లోకి తేవడానికి వీలుగా కేంద్రం తీసుకొస్తున్న మూడు బిల్లులపై కాంగ్రెస్ స్పందించింది. ఈ బిల్లులను మహిళా రిజర్వేషన్ల కోసం తీసుకున్న చర్యలుగా కేంద్రం చెబుతున్నప్పటికీ, వాటి అసలు ఉద్దేశం డీలిమిటేషన్‌పైనే ఉందని ఆరోపించింది. ఈ బిల్లులు రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్య సమతుల్యతను గణనీయంగా మార్చగలవని విమర్శించింది. డీలిమిటేషన్ బిల్లుపై ప్రతిపక్షానికి తీవ్రమైన ఆందోళనలు ఉన్నాయని పేర్కొంది. ప్రస్తుత లోక్‌సభ సభ్యులలో మూడింట ఒక వంతు స్థానాలను ఎస్‌సీ, ఎస్‌టీ, ఓబీసీ వర్గాలకు చెందిన మహిళలకు రిజర్వ్ చేయాలని డిమాండ్ చేసింది. ఇది రాజ్యాంగ విలువలకు అనుగుణంగా ఉండే ప్రజాస్వామ్యయుతమైన విధానమని అభిప్రాయపడింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.
**బీజేపీ బలంగా ఉన్న రాష్ట్రాలకు అనుకూలంగా డీలిమిటేషన్ : జైరాం రమేశ్**
"లోక్‌సభలో మూడు బిల్లులు పరిశీలనకు రానున్నాయి. వాటిని మహిళా రిజర్వేషన్లనే కోసమే తీసుకొచ్చామని చెబుతున్నారు. కానీ వాటి అసలు ఉద్దేశం మాత్రం నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించినదే. ప్రస్తుతం బీజేపీ బలంగా ఉన్న కొన్ని అధిక జనాభా గల రాష్ట్రాలకు అనుకూలంగా ఉన్న ఈ పునర్విభజన ప్రతిపాదనలపై దేశవ్యాప్తంగా అనేక ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ బిల్లుతో లోక్‌సభలో పలు రాష్ట్రాల బలం తగ్గుతుంది. అసోం, జమ్మూకశ్మీర్‌లలో నియోజకవర్గాల పునర్విభజన జరిగిన తీరు, మోదీ-షా ద్వయం ఎంత ఘోరంగా పనిచేస్తుందో మనకు తెలియజేస్తుంది. ఈ బిల్లుల అసలు ఉద్దేశం దురుద్దేశపూరితమైనది. వాటిలోని అంశాలు మోసపూరితమైనవి. ఈ బిల్లుకు కలిగించే నష్టం అపారమైనది. వాటిని పూర్తిగా తిరస్కరించాలి. లోక్‌సభలోని ప్రస్తుత 543 స్థానాలలో మూడింట ఒక వంతు స్థానాలను మహిళలకు రిజర్వ్ చేయాలి. మహిళా రిజర్వేషన్ల బిల్లు పార్లమెంట్‌లోకి వచ్చినప్పుడు 2023లో ప్రతిపక్షం ఇదే వైఖరిని తీసుకుంది. ఇప్పుడు అంతే." అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.
**ఈ బిల్లు దేశ రాజకీయ వ్యవస్థకు హానికరం, వినాశకరం : మనీశ్ తివారీ**
డీలిమిటేషన్ బిల్లును కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ తప్పుపట్టారు. ఈ బిల్లు దేశ రాజకీయ వ్యవస్థకు హానికరం, నష్టదాయకం, వినాశకరమని పేర్కొన్నారు. "నేను మహిళలకు 33 శాతం రిజర్వేషన్లకు మద్దతు ఇస్తున్నాను. ప్రమాదకరమైన ఈ నియోజకవర్గాల పునర్విభజన బిల్లును వ్యతిరేకిస్తున్నాను. ఎందుకంటే దీని పర్యవసానాలు మన రాజకీయ వ్యవస్థకు హానిచేస్తాయి. అలాగే నష్టపరుస్తాయి. ప్రభుత్వ ప్రణాళిక లోక్‌సభలో ప్రాతినిధ్యసమతుల్యతనుమార్చేస్తుంది.అని మనీశ్ తివారీ స్పష్టం చేశారు.
**బిల్లును వీగిపోయేలా చేస్తాం : టీఎంసీ ఎంపీ సాగరిక**
విపక్ష పార్టీలన్నీ మహిళా రిజర్వేషన్‌కు మద్దతు ఇస్తుండగా, మోదీ ప్రభుత్వం మాత్రం డీలిమిటేషన్ సవరణ బిల్లును తీసుకువస్తోందని టీఎంసీ ఎంపీ సాగరిక ఘోష్ మండిపడ్డారు. ఈ బిల్లు ప్రతిపక్షపాలిత రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించి, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సీట్లను పెంచుతుందని ఆరోపించారు. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు 2026కు వ్యతిరేకంగా ఓటేసి, ఈ బిల్లును వీగిపోయేలా చేస్తామన్నారు.
**కనిమొళి కీలక నిర్ణయం**
మరోవైపు, మహిళా రిజర్వేషన్ తక్షణ అమలు, నియోజకవర్గాల పునర్విభజన, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో అసెంబ్లీ సీట్ల పెంపునకు సంబంధించిన మూడు బిల్లులను కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో డీఎంకే ఎంపీ కనిమొళి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మూడు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.
**బిల్లు ప్రతిని కాల్చేసిన స్టాలిన్**
తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ మూడు బిల్లులను తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రతిపాదిత డీలిమిటేషన్ బిల్లు కాపీని గురువారం ఉదయం కాల్చేశారు. అలాగే రాష్ట్రవ్యాప్త డీలిమిటేషన్ వ్యతిరేక ఆందోళనను ప్రారంభించేందుకు నల్ల జెండాను కూడా ఎగురవేశారు. "ఈ ప్రతిఘటన జ్వాలలు తమిళనాడు అంతా వ్యాపించి, బీజేపీ అహంకారాన్ని అణచివేయాలి. గతంలో తమిళనాడులో హిందీకి వ్యతిరేకంగా చేపట్టిన ప్రతిఘటన జ్వాల దిల్లీని దహించేసింది. దిల్లీ దిగొచ్చిన తర్వాతే మా జ్వాల చల్లారింది. ఈ రోజు తమిళులను వారి సొంత గడ్డపై శరణార్థులుగా మార్చే నల్ల చట్టం ప్రతిని తగలబెట్టి నేను మరో జ్వాలను రగిలించాను. ఈ జ్వాల కూడా ద్రవిడ భూమి అంతటా వ్యాపిస్తుంది. ఇది బీజేపీ అహంకారాన్ని అణచివేస్తుంది" అని స్టాలిన్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

## లోక్‌సభ ముందుకు మూడు బిల్లులు- వాడీవేడి చర్చ

పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో భాగంగా లోక్‌సభ ముందుకు మూడు కీలక బిల్లులు వచ్చాయి. దేశంలో మహిళా రిజర్వేషన్లు అమలు చేసే దిశగా కేంద్రం తీసుకొచ్చిన మూడు కీలక బిల్లులపై లోక్ సభలో వాడీవేడి చర్చ జరిగింది. మొదట ఈ బిల్లులను సభలో ప్రవేశపెట్టడాన్ని విపక్షాలు వ్యతిరేకించాయి. మహిళా రిజర్వేషన్లను నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టడాన్ని తప్పుపట్టాయి. విపక్షాల వాదనను అధికార పక్షం తోసిపుచ్చింది. ఈ క్రమంలో రాజ్యాంగ సవరణ బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో ప్రభుత్వానికి అనుకూలంగా మెజార్టీ వచ్చింది. అనంతరం 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై చర్చ నెలకొంది.
**నియోజకవర్గాల పునర్విభజన బిల్లును ప్రవేశపెట్టిన మేఘ్వాల్**
మహిళా రిజర్వేషన్లకు సంబంధించి 131వ రాజ్యాంగ చట్ట సవరణ బిల్లును న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టారు. అనంతరం నియోజకవర్గాల పునర్విభజన బిల్లును కూడా ఆయన సభ ముందుకు తీసుకొచ్చారు. అంతకుముందు కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లును హోంమంత్రి అమిత్‌షా ప్రవేశపెట్టారు. "ఈ రోజు పార్లమెంటు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖితమైంది. 2023లోనే నారీశక్తి వందన్ అధినియం బిల్లును ఆమోదం పొందింది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లపై ఇప్పటికే పార్లమెంటు ఆమోదం పొందగా, ఇప్పుడు వాటిని అమలు చేయాల్సిన సమయం వచ్చింది. కొన్ని బిల్లులను భావితరాలు మరువలేవు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 368 (2) ప్రకారం ప్రజాహిత నిర్ణయాలు తీసుకోవచ్చు. ఆర్టికల్ 368 ద్వారా ప్రజాహిత నిర్ణయాలకు పార్లమెంటుకు రాజ్యాంగం శక్తి ఇచ్చింది. ఈ క్రమంలోనే మూడు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టాం. బిల్లు ద్వారా మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుంది. మహిళలకు సామాజిక న్యాయం కోసం కేంద్రం అనేక పథకాలు తెచ్చింది. మహిళలకు శౌచాలయాలు, ఉజ్వల యోజన అమలు చేశాం. ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక న్యాయం జరగాల్సిందే. మహిళలకు జన్‌ధన్ ఖాతాలు, పీఎం ముద్రా యోజన అమలు చేశాం. సుకన్య సమృద్ధి యోజన, లఖ్‌పతీ దీదీ వంటి పథకాలు అమలు చేశాం. స్వయం సహాయక సంఘాల మహిళలకు చేయూత నిచ్చాం."
**131వ రాజ్యాంగ సవరణ బిల్లును వ్యతిరేకించిన పలు పార్టీలు**
అయితే 131వ రాజ్యాంగ చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టడాన్ని విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, టీఎంసీ, కేరళ రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ, MIM, CPI, ఇతర విపక్షాలు బిల్లును వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఈ బిల్లు ద్వారా ప్రభుత్వం బుల్డోజ్ చేస్తోందని మండిపడ్డాయి. "అప్రజాస్వామిక బిల్లును ఉపసంహరించుకోవాలి. జనాభా గణనపై ప్రభుత్వం ఎందుకు ఆసక్తి చూపట్లేదు? కేంద్రం ఉద్దేశపూర్వకంగా ముస్లింలను మినహాయిస్తోంది. మూడు బిల్లులను కేంద్రం ఉపసంహరించుకోవాలి." అని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ డిమాండ్ చేశారు.
**విపక్షాల ఆరోపణలకు అమిత్ షా కౌంటర్**
ఈ క్రమంలోనే విపక్షాల ఆరోపణలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా తోసిపుచ్చారు. ప్రజల్లో ఆందోళన కలిగించేలా విపక్షాల వ్యాఖ్యలున్నాయని ఆయన మండిపడ్డారు. జనగణన ఎందుకు చేపట్టలేదని విపక్షాలు చెప్పడం సరికాదన్న ఆయన, ఆ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం అయ్యిందని వివరించారు. ప్రస్తుతం ఇళ్ల గణన జరుగుతోందని, ఇళ్లకు ఎలాంటి జాతి ఉండదని పేర్కొన్నారు. వ్యక్తుల గణన సమయంలో జాతి ప్రస్తావన ఉంటుందని స్పష్టం చేశారు.
**మూడు బిల్లులపై శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఓటింగ్**
అనంతరం రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టాలా వద్దా అనే అంశంపై విపక్షాలు డివిజన్ కోరాయి. ఆ మేరకు జరిగిన ఓటింగ్‌లో బిల్లు ప్రవేశపెట్టడానికి అనుకూలంగా 251 మంది ఓటు వేశారు. బిల్లు ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ 185 మంది సభ్యులు ఓటేశారు. ఫలితంగా విపక్షాల డివిజన్ వీగిపోయింది. రాజ్యాంగ సవరణ బిల్లుతో కలిపి రెండు సాధారణ బిల్లులను తీసుకురావడాన్ని కాంగ్రెస్ తప్పుపట్టగా ప్రభుత్వం ఆ వాదనని తోసిపుచ్చింది. అనంతరం 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై స్పీకర్ చర్చకు అనుమతిచ్చారు. ఓటింగ్‌కు ముందు బిల్లులపై సుదీర్ఘ చర్చ జరుగుతుందని లోక్‌సభ స్పీకర్ వెల్లడించారు. బిల్లులపై సభ్యులు ఎన్ని గంటలు కోరినా చర్చ జరపవచ్చని, సభలో సభ్యులందరికీ సమయం ఇస్తామని చెప్పారు. ఈ మూడు బిల్లులపై శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఓటింగ్ జరుగుతుందని తెలిపారు.

# సీనియర్ కాంగ్రెస్ నాయకులకు గుర్తింపు లేకపోవడంపై ఆందోళన; సీఎం రేవంత్

హైదరాబాద్: ముఖ్య రాజకీయ పరిణామంగా, జగిత్యాల డివిజన్‌కు చెందిన సుమారు 150 మంది సీనియర్ కాంగ్రెస్ నాయకులు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు షేక్ చాంద్ పాషా నాయకత్వంలో, హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లి తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇటీవల ఏర్పాటు చేసిన ఎన్ఆర్ఐ బోర్డులో సహా నామినేటెడ్ ప్రభుత్వ పదవుల్లో సీనియర్ పార్టీ కార్యకర్తలకు ప్రాతినిధ్యం కల్పించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిని నేరుగా కలిసే అవకాశం లేకపోవడంతో వారు లిఖిత పూర్వక వినతిపత్రాన్ని సమర్పించారు.



ఈ ప్రతినిధి బృందంలో దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న నాయకులు మరియు గ్రామ స్థాయి కార్యకర్తలు ఉన్నారు. వారు పార్టీకి నిరంతరం సేవలు అందించినప్పటికీ సీనియర్ నాయకులకు నామినేటెడ్ పదవులు ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ కోసం పనిచేయని లేదా ప్రజా సమస్యలపై పనిచేయని కొందరికి ముఖ్యమైన పదవులు ఇచ్చారని, కానీ సంవత్సరాలుగా కష్టపడి పనిచేసిన సీనియర్ నాయకులను పక్కన పెట్టారని వారు పేర్కొన్నారు. దీంతో పార్టీ సీనియర్ కార్యకర్తల్లో అసంతృప్తి పెరిగిందని తెలిపారు.సీనియర్ కాంగ్రెస్ నాయకుడు షేక్ చాంద్ పాషా మాట్లాడుతూ, తాను దాదాపు 30 సంవత్సరాలుగా టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్‌లో పనిచేస్తున్నానని తెలిపారు. గల్ఫ్ కార్మికుల సమస్యలు మరియు ఎన్ఆర్ఐ సంక్షేమానికి సంబంధించిన అంశాలను నిరంతరం ప్రస్తావిస్తున్నానని చెప్పారు. 2004లో పి. జీవన్ రెడ్డి మరియు మాజీ నిజామాబాద్ ఎంపీ మధు యాస్కీ గౌడ్ ప్రోత్సాహంతో కాంగ్రెస్ పార్టీలో చేరానని తెలిపారు. అప్పటి నుంచి గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమంపై దృష్టి పెట్టి పూర్తిస్థాయిలో పనిచేస్తున్నానని చెప్పారు.మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి హయాంలో గల్ఫ్ వలస కార్మికుల కోసం అనేక కార్యక్రమాలు ప్రారంభించబడ్డాయి. ఇందులో ఎన్ఆర్ఐ బోర్డు ఏర్పాటు, జీఓ నెం. 256 కింద గల్ఫ్ బాధితులకు ₹1 లక్ష ఆర్థిక సహాయం, జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో హెల్ప్‌లైన్ సేవలు, పాస్‌పోర్ట్ సేవల విస్తరణ, మోసపూరిత ట్రావెల్ ఏజెన్సీలపై కఠిన చర్యలు వంటి కార్యక్రమాలు ఉన్నాయి. జిల్లా స్థాయిలో అవగాహన కార్యక్రమాలు మరియు విదేశీ ఉపాధి శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహించబడ్డాయి. డి. శ్రీధర్ బాబు నాయకత్వంలో ఎన్ఆర్ఐ వ్యవహారాలు బలోపేతం చేయబడ్డాయి. ఆ సమయంలో తాను ఎన్ఆర్ఐ బోర్డులో పదవి ఇస్తామని హామీ ఇచ్చారని, అయితే 2009లో వై.ఎస్. రాజశేఖర రెడ్డి ఆకస్మిక మరణంతో ఆ అవకాశం కోల్పోయానని షేక్ చాంద్ పాషా తెలిపారు.తెలంగాణ ఉద్యమ సమయంలో మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు ఎన్ఆర్ఐ బోర్డుకు ₹500 కోట్ల కేటాయింపు మరియు విదేశాల్లో మరణించిన గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు ₹5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని హామీ ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలు పూర్తిగా అమలు కాలేదని, కేవలం కమిటీలు మాత్రమే ఏర్పాటు చేశారని ఆరోపించారు. 2018లో కాంగ్రెస్ నాయకులు పి. జీవన్ రెడ్డి తదితరులు గల్ఫ్ బాధిత కుటుంబాలకు ₹5 లక్షల పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీ తరువాత అమలైందని తెలిపారు. 2023 డిసెంబర్ 7న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విదేశాల్లో మరణించిన గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు ₹5 లక్షల పరిహారం అందించడాన్ని ఆయన అభినందించారు.

అయితే తాను ఎన్నో సంవత్సరాలుగా పార్టీకి సేవలు అందించినప్పటికీ కొత్తగా ఏర్పాటు చేసిన ఎన్ఆర్ఐ బోర్డులో తనకు అవకాశం ఇవ్వలేదని షేక్ చాంద్ పాషా నిరాశ వ్యక్తం చేశారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి లేదా పార్టీ కార్యకలాపాలకు పెద్దగా సహకారం అందించని కొందరికి సభ్యులు, ఉపాధ్యక్షులుగా పదవులు ఇచ్చారని, దశాబ్దాలుగా పనిచేసిన వారిని పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ విషయంపై పలు లిఖిత పూర్వక ఫిర్యాదులు ఇచ్చినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని తెలిపారు.ఈ నేపథ్యంలో ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లి తమ సమస్యలను వివరించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నేరుగా కలవలేకపోయినా, వినతిపత్రాన్ని సమర్పించారు. అలాగే షేక్ చాంద్ పాషా రచించిన “గల్ఫ్ గాయం” అనే జీవిత చరిత్ర పుస్తకాన్ని కూడా అందజేశారు. ఆ పుస్తకాన్ని పరిశీలించి గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమానికి చేసిన సేవలను గుర్తిస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

షేక్ చాంద్ పాషా మాట్లాడుతూ, గల్ఫ్ కార్మికుల సమస్యలపై వై.ఎస్. రాజశేఖర రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు, కే. చంద్రశేఖర్ రావు, మెగాస్టార్ చిరంజీవి వంటి నాయకులతో చర్చించినట్లు తెలిపారు. అలాగే గల్ఫ్ వలస కార్మికులకు సంబంధించిన అంశాలపై సీబీఐ, సీఐడీ, ఎన్ఐఏ సంస్థలకు కూడా నివేదికలు అందించినట్లు చెప్పారు.

న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేసిన షేక్ చాంద్ పాషా, తాను రెండు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ పార్టీ మరియు గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం పని చేశానని తెలిపారు. పనిచేయని వారికి పదవులు ఇచ్చి కష్టపడి పనిచేసిన వారిని పట్టించుకోకపోతే గ్రామ స్థాయి కార్యకర్తల్లో నిరుత్సాహం కలుగుతుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు.

రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, సీనియర్ నాయకుల ఆందోళనలను పరిష్కరించడం మరియు అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలను గుర్తించడం పార్టీ ఐక్యతను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు.

## భూదాన ఉద్యమ స్ఫూర్తి పాద యాత్రని ప్రారంభించిన భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి.








**యాదాద్రి భువనగిరి తేహెల్క న్యూస్:**భూదాన ఉద్యమానికి75 సంవత్స రాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న వజ్రోత్సవ వేడుకల లో భాగంగా భూదాన ఉద్యమ స్ఫూర్తి పాదయాత్ర ను ఈ రోజు ఘనంగా ప్రారంభించారు. భువనగిరి నియోజకవర్గ శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి జెండా ఊపి ఈ పాదయాత్ర ను ప్రారంభించారు.మహనీయుడు వినోబా బావే సేవాగ్రామ్ నుండి పోచంపల్లి వర కు ప్రారంభించిన భూదాన యజ్ఞా నికి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా,ఈ నెల 18న జరగ నున్న వజ్రోత్సవ వేడుకలను పుర స్కరించుకొని శివరాంపల్లి నుండి పోచంపల్లి వరకు ఈ పాదయాత్ర ను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని పోచంపల్లి ము న్సిపాలిటీ మరియు సంఘ మిత్ర సంస్థ సంయుక్తంగా చేపట్టాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడు తూ... భూదాన ఉద్యమం సమాజంలో సమానత్వం,సేవాభావం పెంపొం దించడంలో కీలక పాత్ర పోషించిం దని పేర్కొన్నారు. ఈ పాదయాత్ర ద్వారా యువతలో సామాజిక స్పృహ పెంపొందించాలని ఆకాం క్షించారు.అలాగే,వెదిరే రామచంద్ర రెడ్డి సేవ లు మరువలేనివని,ఆయన చేసిన సేవలుసమాజానికి ఎప్పటికీ స్ఫూ ర్తిదాయకమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పోచంపల్లి ము న్సిపల్ చైర్మన్ తడక వెంకటేష్, సంఘ మిత్ర సంస్థ చైర్మన్ తడక యాదగిరి,పట్నం కృష్ణ కుమార్, భారత లవ కుమార్,తడక రమేష్ చింతకింది రమేష్,స్థానిక నాయ కులు,సామాజిక కార్యకర్తలు,ప్రజ లు పాల్గొన్నారు .

## మండల ప్రజా పరిషత్ కార్యాల యంలో ప్రజాపాలన.



**యాదాద్రి భువనగిరి వలిగొండ తేహెల్క న్యూస్:** మండల ప్రజా పరిషత్ కార్యాల యంలో తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్ర భుత్వము ప్రతిష్టాత్మకంగా చేపట్టి న పథకాల అమలుపై జిల్లా కలెక్ట ర్ ఆదేశాల మేరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పై సమీక్ష సమా వేశం గురువారం మండల ప్రత్యేక అధికారి జగన్నాధ రావు అధ్యక్ష తన ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మండల



ప్రత్యేక అధికారి మాట్లాడుతూ... మార్చి6 నుండి 99 రోజుల పాటు గ్రామస్థాయినుండి మండలస్థాయి రాష్ట్ర స్థాయి అన్ని శాఖల సమ్మె నయంతో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే పథకాలు అం దరికి తూచా తప్పకుండా అందేవి ధంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారని ఆయన తెలియ జేశారు.ప్రతి ఒక్క అధికారి ప్రజల కు అందుబాటులో ఉండి పథకా లు అమలు జరిగే విధంగా చూడా లని వారి విధులను తప్పకుండా పాటించాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో మండల రెవె న్యూ తాసిల్దార్ దశరథ నాయక్ మండల్ పరిషత్ అధికారి జి జ లంధర్ రెడ్డి విద్యాధికారి భాస్కర్ పంచాయతీ అధికారి పై ప్రేమలత వ్యవసాయ అధికారి అంజనీ దేవి పంచాయతీ శాఖ పంచాయతీ రా జ్ ఏ ఈ సందీప్ రెడ్డి ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రమ్య మండలవైద్య అధికా రి డాక్టర్ ఖాజా డాక్టర్ జ్యోతి డాక్ట ర్ వేణు మాధవి విద్యశాఖ అధికా రి నర్సింహా ఐకెపి అంజయ్య హా సింగ్ కిరణ్ అశోక్ వివిధ గ్రామాల సర్పంచులు పంచాయతీ కార్యద ర్శులు తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ ప్లాంట్ పునరుద్దించాలి పట్టణంలో 9వ వార్డులను సింగన గూడంలో వాటర్ ప్లాంటును పునర్దించాలి. సిపిఐ ఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ.





**యాదాద్రి భువనగిరి. తేహెల్క న్యూస్:**పట్టణ సింగన్నగూడెం 9వ వార్డు లో వాటర్ ప్లాంట్ ప్రారంభించి 10 సంవత్సరాలు అవుతున్నది.రెం డు మూడు సంవత్సరాల నుండి వాటర్ ప్లాంట్ రిపేరు చేయలేక కరెంట్ బిల్లులు కట్టలేక ప్లాంటు మూసి వేయడం జరిగింది. ప్రస్తుతం ఉన్న కౌన్సిలర్ వాటర్ ప్లాంట్ పునరుద్ధరించి ప్రజలకు మంచినీళ్లు అందించాలని సిపిఎం పార్టీ కోరుతున్నది బైపాస్ రోడ్డు దాటి వెళ్లాలంటే మంచినీటి కోసం ప్రాణాలను అరి చేతిలో పెట్టుకొని రోడ్డు దాటవలసి పరిస్థితి ఉన్నది కావున వెంటనే వాటర్ ప్లాంట్ ను రి ఓపెనింగ్ చేసి ప్రజలకు అందు బాటులోకితేవాలని కోరుతున్నాం ఈ కార్యక్రమంలో పట్టణ సెక్రటేరి యట్ సభ్యుడు గంధ మల్ల మాత య్య,చింతల శివ,మన్నె రమేష్; మన్నె రాజు,చింతల ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 99 రోజుల కార్యాచరణకు శ్రీకారం -- అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ముందుకు



**తెహెల్కా రంగారెడ్డి జిల్లా ఏప్రిల్ 16 ప్రతినిధి ఈ.పద్మారావు కాపు:** గురువారం (ఏప్రిల్ 16, 2026)మహేశ్వరం లోని కాకి ఈశ్వర్ ఫంక్షన్ హాల్‌లో ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక (99 రోజుల కార్యాచరణ ప్రణాళిక) కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ సిహెచ్ యాదయ్య హాజరయ్యారు.సమస్త సర్పంచులు,మండల ప్రత్యేక అధికారి,మండల నోడల్ అధికారి,మండల స్థాయి అధికారులు,పంచాయితీ కార్యదర్శులు,మహిళా సంఘాల సభ్యుల సమక్షంలో కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది.సామాజిక అభివృద్ధి లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పథకాల అమలుపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎంపిడిఓ పి.శైలజ రెడ్డి మాట్లాడుతూ,మండల స్థాయి అధికారులు,ప్రజాప్రతినిధులు మరియు ప్రజలు సమన్వయంతో పనిచేస్తే మహేశ్వరం మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దవచ్చని పిలుపునిచ్చారు.

## బిజెపి పార్టీలో చేరిన బీరం ఇంద్రా రెడ్డి



**కూకట్ పల్లి తెహెల్కా న్యూస్ ప్రతినిధి తెల్ల హరికృష్ణ ఏప్రిల్ 16** కూకట్ పల్లి బాలాజీ నగర్ కంటెస్టెడ్ కార్పొరేటర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు బీరం ఇంద్ర రెడ్డి నీ రాష్ట్ర బిజెపి పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు బిజెపి పార్టీ కండవని కప్పి పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది, ఈ కార్యక్రమంలో స్టేట్ మైనార్టీ మోర్చా సీనియర్ నాయకులు షేక్ షాజహాన్, హైదర్ నగర్ డివిజన్ నాయకులు చంద్రమౌళి, రజిని తదితరులు పార్టీలో చేయడం జరిగింది.

## శ్రీమఠం లో గురువారం పూజలు



**మంత్రాలయం తెహెల్కా న్యూస్:** సుప్రసిద్ధ పుణక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర మఠంలో చైత్ర మాసం గురువారం సందర్భంగా శ్రీమఠం పీఠాధిపతులు శ్రీ సుబుదేంద్ర తీర్థ స్వామీజీ ఆధ్వర్యంలో విశేషంగా పూజలను నిర్వహించారు. ముందుగా శ్రీరాఘవేంద్ర స్వామి మూల బృందావనంకు ఆలయ అర్చకుల వేదమంత్రోచ్ఛనాల నడుమ, పాలు, పెరుగు, తేనె కొబ్బరి నీరు వంటి వివిధ రకాల పళ్ళ రసాల ద్రవ్యాలతో విశేష పంచామృతాభిషేకంను నిర్వహించి, దూప దీప నివేదనలు సమర్పించారు.అనంతరం సంస్థాన పూజల్లో భాగంగా పూర్ణ బోధ మండపంలో శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుబుదేంద్ర తీర్థ స్వామీజీ, శ్రీ మూలరాముల విగ్రహాలకు విశేష పూజలను నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

# ఘోర రోడ్డు ప్రమాదం..... బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పిన టీడీపీ ఇన్చార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి





**మంత్రాలయం తెహెల్కాన్యూస్:** మంత్రాలయం మండలం చిలకలదోణ గ్రామ శివారులో బులెరో గూడ్స్ వాహనం ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో గురువారంతెల్లవారుజామునజరిగిన భయానక రోడ్డు ప్రమాదంలో 8 మంది ప్రాణాలు కోల్పోయి, 14 మందికి గాయాలయ్యాయి.మృతులు కర్ణాటక రాష్ట్ర వాసులుగా పోలీస్ లు గుర్తించారు.ఈ ఘటనపై మంత్రాలయం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ విషాద ఘటనపై స్పందించిన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల ఆర్థిక సాయం ప్రకటించారు.అనంతరం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ఈ సందర్భంగా బాధితులకు ధైర్యం చెబుతూ, ఎలాంటి ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.
ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడి, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని వైద్యులకుసూచించారు.అలాగే మృతి చెందిన వారి భౌతికకాయాలను వారిస్వగ్రామాలకు తరలించేందుకు ప్రభుత్వం తరుపున అంబులెన్సు సదుపాయంకూడా ఏర్పాటు చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, మంత్రాలయం టౌన్ టీడీపీ ప్రెసిడెంట్ వరదరాజులు మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తాం: పంచాయతీరాజ్ కమిషనర్



**తెహెల్కా రంగారెడ్డి జిల్లా ఏప్రిల్ 16 ప్రతినిధి ఈ.పద్మారావు కాపు:** మహిళలందరూ అక్షరాస్యులుగా అభివృద్ధి చెందాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ దివ్య దేవరాజ్ పేర్కొన్నారు. గురువారం ఫరూక్ నగర్ మండల కార్యాలయంలో నిర్వహించిన 99 రోజుల ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా వివిధ శాఖల ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలపై అధికారులు ప్రజలకు వివరించారు. రైతు రుణ మాఫీ, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, వడ్డీ లేని రుణాలు, రేషన్ కార్డులు, వైద్య సేవలు వంటి పథకాల వివరాలు తెలియజేశారు. అలాగే ముఖ్యమంత్రి అల్పాహారం పథకం, కుటుంబ బీమా, మధ్యాహ్న భోజన పథకం విస్తరణ, సహజ వ్యవసాయం వంటి కొత్త పథకాలపై అవగాహన కల్పించారు.
దివ్య దేవరాజ్ మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మహిళలకు బస్సులు, సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు అందిస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. మహిళా సంఘాల భవనాల నిర్మాణం కూడా వేగంగా జరుగుతోందని తెలిపారు. గ్రామీణాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని ఆమె పేర్కొన్నారు.
జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు హెల్మెట్,సీట్ బెల్ట్ వినియోగంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను విజయవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు.అనంతరం కళ్యాణ లక్ష్మి చెక్కులు,అంగన్వాడీ విద్యార్థులకు యూనిఫాంలు,దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు,ప్రజలు పాల్గొన్నారు.

# కొండాపూర్ ప్రభుత్వాసుపత్రిపై ఆరోగ్య శాఖ కమిషనర్ ఆకస్మిక తనిఖీ




**తెహెల్కా రంగారెడ్డి జిల్లా ఏప్రిల్ 16 ప్రతినిధి ఈ.పద్మారావు కాపు:** తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ రంగారెడ్డి జిల్లా కొండాపూర్ ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా తెలంగాణ డయాగ్నస్టిక్ సేవల ద్వారా అందిస్తున్న పరీక్షలపై వైద్యులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు.ప్రజలకు అందిస్తున్న 134 వైద్య పరీక్షలను సకాలంలో పూర్తి చేసి,నివేదికలను సమయానికి అందించాలని వైద్యులకు ఆమె ఆదేశించారు.మాతా సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ,ప్రతి గర్భిణీని ఎంసిహెచ్ పోర్టల్‌లో నమోదు చేసి నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు.అలాగే జిల్లాలో రక్తపోటు,మధుమేహం వంటి అసంక్రమిత వ్యాధులతో బాధపడుతున్న రోగులకు తగిన మందులు,ఫాలోఅప్ సేవలు అందించాలని ఆదేశించారు.వికలాంగులకు ఆసుపత్రుల్లో సౌకర్యాలు కల్పించేందుకు ర్యాంపులు, రైలింగులు,వీల్‌చైర్లు ఏర్పాటు చేయాలని,వర్షపు నీటి సంరక్షణ కోసం ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులకు సూచించారు. బస్తీ దవాఖానాల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులను త్వరితగతిన భర్తీ చేయాలని ఆదేశించారు.ఇదే సందర్భంగా కొండాపూర్‌లో నిర్మాణంలో ఉన్న గ్రామ కేర్ సెంటర్‌ను పరిశీలించిన కమిషనర్,జిల్లాలో కనీసం 30 శాతం ఆసుపత్రులు జాతీయ నాణ్యతా ప్రమాణాలు పొందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి, డిసిహెచ్ఎస్ డాక్టర్ అనురాగిణి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రకృష్ణతో పాటు ఇతర అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# భువనగిరి బస్టాండ్‌లో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం.





**యాదాద్రి భువనగిరి. తేహెల్క న్యూస్:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా రవాణాశాఖ ఆధ్వ ర్యంలో 19వ వార్డు భువనగిరి బ స్టాండ్‌లో బుధవారం 'అరైవ్ అలై వ్' రోడ్డు భద్రత అవగాహన కార్య క్రమం జరిగింది.
ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లాఎస్పీ ఆకాంక్ష్ యా దవ్,మున్సిపల్ చైర్‌పర్సన్ తంగ ళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్,డిఎస్పి రవీందర్ యాదవ్,ట్రాఫిక్ సీఐ లు పాల్గొన్నారు చైర్‌పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలను నివారించడం మనందరి బాధ్యత.హెల్మెట్,సీట్ బెల్ట్ తప్పనిసరిగా వాడాలి.18 ఏళ్లు నిండి, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారే వాహనాలు నడపాలి. మీ భద్రత మీ కుటుంబానికి భరోసా" అని సూచించారు.
జిల్లా ఎస్పీ ఆకాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ... "అతివేగం,మద్యం సేవించి డ్రైవిం గ్ ప్రాణాంతకం.ట్రాఫిక్ నియమా లు పాటించి ప్రాణాలు కాపాడు కోండి" అని పేర్కొన్నారు.
ప్రయాణికులు,ఆటో డ్రైవర్లు,స్థాని క ప్రజలకు రోడ్డు భద్రతపై అవగా హన కల్పించారు.
కరపత్రాలు పంపిణీ చేసి,ప్రమాదా ల వల్ల కుటుంబాలు ఎదుర్కొనే కష్టాలను వివరించారు.
ఈ కార్యక్రమంలో పట్టణ మున్సి పల్ వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజు ల,స్థానిక కౌన్సిలర్ బందారి స్వర్ణ లత,బర్రె ప్రవీణ్ మున్సిపల్ కమిష నర్,రవాణాశాఖ అధికారులు,పో లీస్ అధికారులు,సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.

# బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అధిక ప్రాధాన్యత -- సమగ్ర సర్వేపై లక్ష్మారెడ్డి హర్షం




**తెహెల్కా రంగారెడ్డి జిల్లా ఏప్రిల్ 16 ప్రతినిధి ఈ.పద్మారావు కాపు:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చెన్న లక్ష్మారెడ్డి తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక,కుటుంబ సర్వేపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సర్వే దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.జనాభా దామాషా ప్రకారం భవిష్యత్తులో బీసీ,ఎస్సీ,ఎస్టీలకు రాజకీయ అవకాశాలు పెరుగుతాయని ఆయన తెలిపారు.కేంద్ర ప్రభుత్వం కూడా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈ సర్వేను ఆదర్శంగా తీసుకుని దేశవ్యాప్తంగా అమలు చేయాలని కోరారు.నిపుణుల కమిటీ రూపొందించిన సర్వే వివరాలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచడం పారదర్శకతకు నిదర్శనమని అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధిక జనాభా కలిగిన వర్గాలకు తగిన ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.బలహీన వర్గాల సంక్షేమం కోసం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని,సమాజంలో ఉన్న వెనకబాటుతనాన్ని తగ్గించేందుకు అన్ని రాజకీయ పార్టీలు కృషి చేయాలని లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు.

## తేజస్వీ సూర్య వ్యాఖ్యలు తెలంగాణ అస్తిత్వానికే అవమానం: బేషరతుగా క్షమాపణ చెప్పాలి

### తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి డిమాండ్



**తెహెల్కా రంగారెడ్డి జిల్లా ఏప్రిల్ 16 ప్రతినిధి ఈ.పద్మారావు కాపు:** రంగారెడ్డి జిల్లా కేశంపేట మండల కేంద్రంలో నిర్వహించిన ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది.ఫైనల్ మ్యాచ్‌ను లేమామిడి మరియు అల్వాల్ జట్ల మధ్య నిర్వహించారు.ఈ మ్యాచ్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం గ్రామీణ ప్రాంత యువతకు మంచి వేదికగా నిలుస్తుందని తెలిపారు.క్రీడా స్ఫూర్తిని వెలికి తీయడంలో సంసద్ ఖేల్ మహోత్సవం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.మండల కోఆర్డినేటర్ కంచుకోట మహేష్ మాట్లాడుతూ ఈ టోర్నమెంట్ విజయవంతానికి సహకరించిన భారతీయ జనతా పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పసుల నరసింహా యాదవ్,అత్తాపురం మహేందర్ రెడ్డి, ఆనేమూని కృష్ణ,శేఖర్ రెడ్డి,రాఘవేందర్ రెడ్డి,యాదయ్య,పవన్ కుమార్,గణేష్,దాసరి మహేష్ తదితరులు మరియు రెండు జట్ల ఆటగాళ్లు పాల్గొన్నారు.






కూకట్పల్లి ప్రెస్ రిపోర్టర్ ,సామాజిక వేత తెలంగాణ రాష్ట్ర పౌర హక్కుల పరిరక్షణ సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు నిమ్మగాళ్ల అర్జున్ పుట్టినరోజు సందర్భంగా షాపూర్ నగర్, ఎమ్మీ కాలనీ నిర్మాణ్ డిజేబుల్ పర్సన్స్ ఆశ్రమానికి నిత్యవసర వస్తువులను పంపిణీ చేయడం జరిగింది,ఈ కార్యక్రమంలో కోమగల్ల మోజస్, నల్లోల రాము, మరియు పోనల్ల నాగరాజ్ పాల్గొనడం జరిగింది..

## బాక్స్ డ్రైన్స్ నిర్మాణం పై అధికారులతో సమీక్ష.

### ప్రజల సహకారం, అధికారులు ఐక్యతగా ఉంటేనే పనులు పూర్తవుతాయి -- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.



**ఎల్.బి.నగర్,ఏప్రిల్ 16,తేహేల్కా ప్రతినిధి మురళీమోహన్ గౌడ్.**
గత వారం రోజుల క్రితం ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల వినతి మేరకు అట్టి కాలనీ నందు పర్యటించిన విషయం తెలిసిందే.దానిలో భాగంగా ఈ రోజు వారి క్యాంపు కార్యాలయంలో అట్టి కాలనీవాసులను మరియు అధికారులను పిలిపించి సమస్యల మీద ప్రస్తావించడం జరిగింది.దానిలో భాగంగా అక్కడ చేపడుతున్న బాక్స్ డ్రైన్స్ పనులను త్వరగా పూర్తి చేయాలనీ ఆదేశించారు.
అదేవిదంగా అక్కడ సివరేజ్ పనుల సమస్యలు కూడా ఉన్నాయి.వాటిని కూడా పరిష్కారం చేయాలనీ సూచించారు.బాక్స్ డ్రైన్స్ నందు సివరేజ్ వాటర్ కలవడం జరుగుతున్న నేపథ్యంలో సివరేజ్ వాటర్ కలవకుండా చూడాలని సూచించారు.అట్టి బాక్స్ డ్రైన్స్ పనుల్లో భాగంగా కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా పనులు సక్రమంగా చేసే విధంగా ప్రణాళికలు చేయాలనీ సూచించారు.అదే విధంగా వైభవ్ టిఫిన్ సెంటర్ నుండి చైతన్యపూరి నాలా వరకు కొత్తగా నూతన బాక్స్ డ్రైన్స్ కోసం గతంలో ప్రతిపాదనలు పంపడం జరిగింది.ఇప్పుడు అవి టెండర్ దశలో ఉన్న నేపథ్యంలో టెండర్లు త్వరగా పూర్తి చేసి బాక్స్ డ్రైన్స్ పనులు ప్రారంభం చేయాలని అధికారులను ఆదేశించారు.అట్టి పనులు సకాలంలో పూర్తి అయితే చుట్టుపక్కల ఉన్న కమలానగర్ తదితర కాలనీవాసులకు వర్షపు నీటి సమస్యల నుండి విముక్తి లభిస్తుంది అని తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో గడ్డిఆన్నారం డివిజన్ మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్,అధికారులు విజయ్ కుమార్,మమత,కాలనీవాసులు నర్సింహా రావు,ఆనంద్,ప్రకాష్,గోపాల్,శ్రీనివాస్,ప్రభాకర్ చారి, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ తరపున రాజ్యసభకు ఏకగ్రీవ ఎన్నిక -- నరేందర్ రెడ్డిని కలిసిన చిలుక మధుసూదన్ రెడ్డి



**తెహెల్కా రంగారెడ్డి జిల్లా ఏప్రిల్ 16 ప్రతినిధి ఈ.పద్మారావు కాపు:** తెలంగాణ రాష్ట్రం నుండి కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన వేం.నరేందర్ రెడ్డి గురువారం ఉదయం పార్లమెంట్‌లో రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి,పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి,ప్రజల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తానని తెలిపారు.ఆయనకు వివిధ వర్గాల ప్రజల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

# బంగారం ధరలు

| | | |
|---|---|---|
| హైదరాబాద్ | 1,57,340.00 | 1,56,340.00 |
| ముంబయి | 1,57,270.00 | 1,56,270.00 |
| న్యూఢిల్లీ | 1,56,980.00 | 1,55,980.00 |



# వ్యాపారం

## సమ్మర్ బిజినెస్.. వేసవిలో బంపర్ ఆదాయం..

## ఈ వ్యాపారాలతో కాసుల వర్షం!



వేసవిలోని ఈ 3-4 నెలలు మీ వార్షిక ఆదాయంలో ఒక పెద్ద భాగాన్ని అందించగలవు. సరైన ప్లానింగ్, కష్టపడే తత్వం ఉంటే ఈ చిన్న వ్యాపారాలే మిమ్మల్ని ఆర్థికంగా బలోపేతం చేస్తాయి. మరి ఇంకెందుకు ఆలస్యం? మీ బడ్జెట్‌కు తగ్గ.. ఏప్రిల్ నెల పూర్తి కాకముందే ఎండలు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కొద్దీ ప్రజల అవసరాలు కూడా మారుతుంటాయి. ఈ మార్పునే పెట్టుబడిగా మార్చుకుంటే వేసవిలో అద్భుతమైన లాభాలను గడించవచ్చు. కేవలం రూ.10,000 నుండి రూ.50,000 పెట్టుబడితో ప్రారంభించగల 5 సూపర్ హిట్ బిజినెస్ ఐడియాలు మీ కోసం. బంగారానికి ఇప్పుడు లాభం ఎంతో తెలిస్తే మతిపోతుంది!

1. కూలర్లు, ఏసీలను అద్దెకు ఇవ్వడం:
వేసవిలో అందరూ కొత్త ఏసీలు లేదా కూలర్లు కొనలేరు. ముఖ్యంగా అద్దె ఇళ్లలో ఉండేవారు లేదా తాత్కాలికంగా నగరానికి వచ్చేవారు వీటిని అద్దెకు తీసుకోవడానికి మొగ్గు చూపుతారు.
ఐడియా: సెకండ్ హ్యాండ్ కూలర్లను కొనుగోలు చేసి, వాటిని మంచి కండిషన్‌లో ఉంచి సీజన్ వారీగా అద్దెకు ఇవ్వవచ్చు. దీనికి ఆదాయం ఒక కూలర్‌పై నెలకు రూ.500 నుండి రూ.1000 వరకు అద్దె వస్తుంది. సీజన్ ముగిసేసరికి మీ పెట్టుబడి తిరిగి రావడమే కాకుండా మంచి లాభం కూడా మిగులుతుంది.

2. ఐస్ క్యూబ్స్ సప్లై (×షివ జబఎవ ాబబజూజూశ్రీఎ)
వేసవిలో శుభకార్యాలు, పార్టీలు, రెస్టారెంట్లు, జ్యూస్ సెంటర్లలో ఐస్ క్యూబ్స్ డిమాండ్ విపరీతంగా పెరుగుతుంది.
ఐడియా: ఒక చిన్న ఐస్ మేకింగ్ మెషిన్ లేదా డీప్ ఫ్రీజర్ సహాయంతో శుభ్రమైన నీటితో ఐస్ క్యూబ్స్ తయారు చేసి సమీపంలోని హోటళ్లకు, ఈవెంట్లకు సరఫరా చేయవచ్చు. దీనికి కూడా మంచి ఆదాయం పొందవచ్చు.

3. సన్ స్క్రీన్, సన్ గ్లాసెస్ విక్రయం
ఎండల నుండి రక్షణ పొందేందుకు ప్రజలు ఇప్పుడు చాలా అవగాహనతో ఉన్నారు. అందుకే వేసవిలో సన్ స్క్రీన్ లోషన్లు, మాయిశ్చరైజర్లు, స్టైలిష్ సన్ గ్లాసెస్‌కు గిరాకీ బాగుంటుంది.
ఐడియా: రద్దీగా ఉండే మార్కెట్ ప్రాంతాల్లో లేదా కాలేజీల దగ్గర చిన్న స్టాల్ ఏర్పాటు చేసి బ్రాండెడ్, బడ్జెట్ ఫ్రెండ్లీ వస్తువులను విక్రయించవచ్చు.

## 2021లో కొన్న బంగారానికి ఇప్పుడు లాభం ఎంతో తెలిస్తే మతిపోతుంది!




ప్రతి సంవత్సరం చిన్న మొత్తాలలో పెట్టుబడి పెట్టడం దీర్ఘకాలంలో పెద్ద లాభాలను అందిస్తుందని ఈ ఉదాహరణ స్పష్టంగా చూపిస్తుంది. అందువల్ల అక్షయ తృతీయ వంటి సాంప్రదాయ రోజులలో బంగారం కొనడం కేవలం నమ్మకానికి సంబంధించిన విషయంగానే కాకుండా..అక్షయ తృతీయ రోజున బంగారం నగలు ధరిస్తే ఏడాది పొడవునా ఇంట్లో సంపద పెరుగుతుందని భారతీయులలో ఒక నమ్మకం ఉంది. దీని కారణంగా ప్రజలు ఆ రోజున సాధారణం కంటే ఎక్కువగా బంగారంపై పెట్టుబడి పెడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇరాన్ -- అమెరికా మధ్య ఇటీవల నెలకొన్న యుద్ధ ఉద్రిక్తత బంగారం, వెండి ధరలలో అస్థిరతను సృష్టించింది. దీని కారణంగా ఈ సంవత్సరం అక్షయ తృతీయ నాడు బంగారం అమ్మకాలు ఎలా ఉంటాయోనని అందరూ ఎదురుచూస్తున్నారు.బంగారం ధర రోజురోజుకీ పెరుగుతోంది. దీని కారణంగా బంగారం కొనడం ఒక మంచి పెట్టుబడిగా పరిగణిస్తారు. ఈ పరిస్థితుల్లో మీరు 2021 నుండి ప్రతి సంవత్సరం అక్షయ తృతీయ నాడు 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారు నాణెం కొనుగోలు చేసి ఉంటే, ఈ రోజు అది ఎంత లాభాన్ని ఇచ్చి ఉండేదో లెక్కలు వేస్తే ఆశ్చర్యమేస్తుంది.

2021లో ఒక సవరన్ బంగారం ధర రూ.46,500గా ఉంది. ఆ తర్వాత 2022లో అది రూ. 51,510, 2023లో రూ. 61,300, 2024లో రూ. 73,240, 2025లో రూ. 96,500గా ఉంది. ఏటా బంగారం ధర ఎలా పెరుగుతూ వస్తోందో ఇది స్పష్టంగా చూపిస్తుంది. దీని ప్రకారం, మీరు 2021లో 10 గ్రాముల బంగారు నాణెం కొనుగోలు చేసి ఉంటే, 5 సంవత్సరాలలో దాదాపు 135 శాతం లాభం పొంది ఉండేవారు. ప్రస్తుతం 10 గ్రాముల బంగారం ధర సుమారు రూ.1,55,000గా ఉంది. అంటే మన లాభం ప్రతి సంవత్సరం 39 నుండి 44 శాతం వరకు పెరిగిందని అర్థం. బంగారం ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, కేంద్ర బ్యాంకుల బంగారు నిల్వలు పెరగడం, అంతర్జాతీయ రాజకీయ ఉద్రిక్తతలు అని చెబుతున్నారు. ప్రతి సంవత్సరం చిన్న మొత్తాలలో పెట్టుబడి పెట్టడం దీర్ఘకాలంలో పెద్ద లాభాలను అందిస్తుందని ఈ ఉదాహరణ స్పష్టంగా చూపిస్తుంది. అందువల్ల అక్షయ తృతీయ వంటి సాంప్రదాయ రోజులలో బంగారం కొనడం కేవలం నమ్మకానికి సంబంధించిన విషయంగానే కాకుండా, ఒక బలమైన పెట్టుబడిగా కూడా మారింది. అందుకే ఆ రోజున ప్రజలు బంగారు ఆభరణాలు కొనడానికి దుకాణాలకు ఉత్సాహంగా తరలివస్తారు.

# క్రీడలు


## టీమిండియాలోకి వైభవ్ ఎంట్రీ..



వైభవ్ సూర్యవంశీ ఐర్లాండ్ పర్యటనకు ఎంపికయ్యే అవకాశం ఉంది. అతడి కోసం సంజూ, అభిషేక్ లేదా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్థానాల్లో ఎవరికో ఒకరికి ముప్పు పొంచి ఉంది. వైభవ్ రాక కేవలం ఓపెనర్లకే కాదు, మిడిల్ ఆర్డర్ బ్యాటర్లకు డేంజర్ గా మారింది. భారత క్రికెట్ ప్రపంచంలో ఇప్పుడు ఎక్కడ చూసినా 15 ఏళ్ల సంచలనం వైభవ్ సూర్యవంశీ పేరే వినిపిస్తోంది. ఐపీఎల్‌లో బుమ్రా, బోల్ట్ వంటి దిగ్గజ బౌలర్లనే భయపెట్టిన ఈ కుర్రాడు.. ఇప్పుడు ఏకంగా టీమిండియా డెబ్యూకు సిద్ధమవుతున్నాడు. జూన్‌లో జరగబోయే ఐర్లాండ్ పర్యటన కోసం షార్ట్‌లిస్ట్ చేసిన ఆటగాళ్లలో వైభవ్ పేరు ఉండటంతో చర్చ మొదలైంది. అయితే, ఒక అద్భుతం జట్టులోకి రావాలంటే ఎవరో ఒకరు త్యాగం చేయక తప్పదు. మరి వైభవ్ కోసం ఎవరి సీటు డేంజర్లో ఉంది? కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పరిస్థితి ఏంటి? విషయాలు తెలుసుకుందాం.భారత జట్టు జూన్ నెలలో ఐర్లాండ్‌లో రెండు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. ఆ తర్వాత ఇంగ్లాండ్ పర్యటన కూడా ఉంది. అయితే ఐర్లాండ్ సిరీస్ కోసం సెలక్టర్లు ఇప్పటికే 35 మంది ఆటగాళ్ల పేర్లను బీసీసీఐ లాజిస్టిక్స్ విభాగానికి పంపారు. ఇందులో వైభవ్ సూర్యవంశీ పేరు ఉండటం విశేషం. వీరందరికీ వీసా ప్రక్రియ పూర్తి చేయాల్సిందిగా సెలక్టర్లు కోరారు. సాధారణంగా 15 మందితో ఉండే జట్టును ఈసారి 16 లేదా 17 మందికి పెంచాలని యోచిస్తున్నారు. అయితే, స్క్వాడ్‌లో ఉండటం వేరు.. తుది జట్టులో (ప్లేయింగ్ 11) చోటు సంపాదించడం వేరు.

వైభవ్ వస్తే ఎవరికి కౌంట్ డౌన్?
ప్రస్తుతం టీమిండియా టీ20 ఓపెనింగ్ స్లాట్ కోసం విపరీతమైన పోటీ ఉంది. అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ ఈ ముగ్గురూ టీ20 వరల్డ్ కప్ 2026లో అదరగొట్టారు. సంజూ అయితే ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచాడు, అభిషేక్ నంబర్-1 బ్యాటర్. వీరితో పాటు యశస్వి జైస్వాల్ కూడా రేసులో ఉన్నాడు. ఇప్పుడు వైభవ్‌ను ఓపెనర్‌గా తీసుకుంటే, వీరిలో ఒకరిని పక్కన పెట్టాల్సి ఉంటుంది. వరల్డ్ కప్ ఫైనల్‌లో హాఫ్ సెంచరీలు చేసిన వీరిని ఏ కారణం చెప్పి తప్పిస్తారన్నది సెలక్టర్లకు పెద్ద తలనొప్పిగా మారింది.కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ గత కొన్ని మ్యాచ్‌లుగా ఫామ్ కోసం ఇబ్బంది పడుతున్నాడు. ఒకవేళ వైభవ్ కోసం సంజూ లేదా అభిషేక్ వంటి ఇన్-ఫామ్ ఆటగాళ్లను పక్కన పెడితే, ఫామ్ లో లేని సూర్యకుమార్ జట్టులో ఎలా కొనసాగుతారని అభిమానులు ప్రశ్నించే అవకాశం ఉందని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. వైభవ్ రాక కేవలం ఓపెనర్లకే కాదు, మిడిల్ ఆర్డర్ బ్యాటర్లకు, ముఖ్యంగా కెప్టెన్ సీటుకే ఎసరు పెట్టేలా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారువైభవ్ సూర్యవంశీ కేవలం ఐర్లాండ్ సిరీస్ మాత్రమే కాదు.. ఆ తర్వాత జరిగే జింబాబ్వే పర్యటన, వెస్టిండీస్ హోమ్ సిరీస్ లేదా జపాన్‌లో జరిగే ఏషియన్ గేమ్స్ (ాంఖుఅ +ుఎవం) రేసులో కూడా ఉన్నాడు.

## కింగ్స్ అజేయంగానే.. పంజాబ్‌కు నాలుగో విజయం



కింగ్స్ అజేయంగానే.. పంజాబ్‌కు నాలుగో విజయం ఐపీఎల్-19లో ఓటమన్నదే లేకుండా ఆడుతున్న పంజాబ్ కింగ్స్ జైత్రయాత్ర కొనసాగించింది. బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు తోడు టాపార్డర్ బ్యాటర్ల బాదుడుతో ఆ జట్టు ముంబై ఇండియన్స్‌ను చిత్తు చేసి సీజన్‌లో నాలుగో విజయాన్ని నమోదుచేసింది. ముంబై: ఐపీఎల్-19లో ఓటమన్నదే లేకుండా ఆడుతున్న పంజాబ్ కింగ్స్ జైత్రయాత్ర కొనసాగించింది. బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు తోడు టాపార్డర్ బ్యాటర్ల బాదుడుతో ఆ జట్టు ముంబై ఇండియన్స్‌ను చిత్తు చేసి సీజన్‌లో నాలుగో విజయాన్ని నమోదుచేసింది. వాంఖడే వేదికగా జరిగిన పోరులో పంజాబ్.. ముంబైని 7 వికెట్ల తేడాతో ఓడించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (39 బంతుల్లో 80 నాటౌట్, 11 ఫోర్లు, 2 సిక్సులు), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (35 బంతుల్లో 66, 5 ఫోర్లు, 4 సిక్సులు) మెరుపు ఇన్నింగ్స్‌లతో ఛేదనను ఆ జట్టు 16.3 ఓవర్లలో మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి దంచేసింది.మొదట బ్యాటింగ్‌కు వచ్చిన ముంబైకి డికాక్ (60 బంతుల్లో 112 నాటౌట్, 8 ఫోర్లు, 7 సిక్సులు) ఈ సీజన్‌లో తన ఆగమనాన్ని సెంచరీతో ఘనంగా చాటడంతో ఆ జట్టు నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 195 రన్స్ చేసింది. నమన్ ధీర్ (31 బంతుల్లో 50, 3 ఫోర్లు, 3 సిక్సులు) డికాక్‌కు అండగా నిలిచి అర్ధ శతకంతో రాణించాడు.4, 4, 6, 4.. ఛేదనలో చాహర్ వేసిన తొలి ఓవర్లోనే పంజాబ్ ఓపెనర్ల జోరు అది. ఆదిలోనే రెండు కీలక వికెట్లను కోల్పోయినా ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్, 'సర్పంచ్ సాబ్' శ్రేయాస్ దూకుడుతో కింగ్స్ మ్యాచ్‌ను పూర్తి ఏకపక్షంగా మార్చేసింది. రెండు బౌండరీలు, ఓ సిక్స్‌తో జోరు చూపించిన ప్రియాన్ష్ (15)తో పాటు కనోలి (17)ను గజన్‌ఫర్ ఔట్ చేసినా అది పంజాబ్ ఛేదనపై ప్రభావం చూపలేకపోయింది. ఫామ్‌ను కొనసాగిస్తూ ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్, ముంబై బౌలర్లపై విరుచుకుపడ్డాడు. చాహర్, హార్దిక్, శార్దూల్.. అందరూ అతడి బాదుడుకు బాధితులే. హార్దిక్ పదో ఓవర్లో రెండు బౌండరీలతో కింగ్స్ స్కోరుబోర్డు వంద పరుగులు దాటింది.ఆ తర్వాత శార్దూల్ బౌలింగ్‌లో రెండు ఫోర్లతో అతడి హాఫ్ సెంచరీ పూర్తయింది. అదే ఓవర్లో సిక్స్‌తో జోరందుకున్న శ్రేయాస్.. ఈ సీజన్‌లో ఒక్క వికెట్ కూడా తీయలేక చతికిలపడుతున్న బుమ్రా బౌలింగ్‌లో డీప్‌మిడ్ వికెట్ మీదుగా చూడచక్కని సిక్స్ కొట్టాడు. అతడే వేసిన 15వ ఓవర్లో రెండు ఫోర్లతో అయ్యర్ కూడా సీజన్‌లో వరుసగా మూడో అర్ధ శతకాన్ని నమోదుచేశాడు. శార్దూల్ ఓవర్లో రెండు సిక్సులు కొట్టిన శ్రేయాస్, మూడో బంతికి నిష్క్రమించడంతో 66 బంతుల్లోనే 139 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. అప్పటికే విజయం ఖాయమవగా.. స్టోయినిస్ (10లి), ప్రభ్‌సిమ్రన్ మిగతా పని పూర్తిచేశారు.అర్ష్‌దీప్ విసిరిన రెండో ఓవర్లో ఇచ్చిన డబుల్ షాకులతో 12/2గా నిలిచిన ముంబైని ఈ సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడిన డికాక్, మిడిలార్డర్‌లో నమన్ ఆదుకున్నారు. ఈ జోడీ మూడో వికెట్‌కు 68 బంతుల్లోనే శతాధిక (122) భాగస్వామ్యం నెలకొల్పి ఆతిథ్య జట్టుకు పోరాడగలిగే స్కోరునందించారు. రికెల్టన్ వికెట్‌తో ఐపీఎల్ కెరీర్‌లో వందో వికెట్‌ను తన ఖాతాలో వేసుకున్న అర్ష్‌దీప్ రెండో బంతికి సూర్యను డకౌట్ చేశాడు.ఈ దశలో డికాక్, ధీర్ పంజాబ్ బౌలింగ్‌పై ఎదురుదాడికి దిగి బౌండరీలు, సిక్సులతో రెచ్చిపోయారు. డికాక్‌కు పూర్తి సహకారం అందించిన నమన్.. శశాంక్ ఓవర్లో లాంగాన్ మీదుగా సింగిల్ తీసి హాఫ్ సెంచరీ సాధించినా అదే ఓవర్లో లాంగాఫ్ వద్ద బార్ట్‌లెట్‌కు చిక్కడంతో మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. శశాంక్ ఓవర్లో రెండు సిక్సులతో 90లలోకి వచ్చిన డికాక్.. బార్ట్‌లెట్ బౌలింగ్‌లో బౌండరీతో ఈ లీగ్‌లో మూడో సెంచరీని నమోదుచేశాడు.

# టాప్ యాంగిల్ అందాలతో కియారా



ఎంఎస్ ధోనీ సినిమాతో బాలీవుడ్ లో గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ కియారా అద్వానీ. ఈ అమ్మడు తెలుగు లో భరత్ అనే నేను మరియు వినయ విధేయ రామ సినిమాల్లో నటించిన విషయం తెల్సిందే. ఆ సినిమా ల్లో భరత్ అనే నేను మంచి విజయాన్ని సొంతం చేసుకోగా వినయ విధేయ రామ సినిమా డిజాస్టర్ గా నిలిచింది. మరో వైపు బాలీవుడ్ లో వరుస సినిమాలు చేస్తూ దూసుకు పోతుంది. ఈ అమ్మడు హీరోయిన్ గా అక్కడ ఏడాదికి రెండు మూడు సినిమాలు వస్తూనే ఉన్నాయి. పెళ్లి తర్వాత కూడా కెరీర్ ఏమాత్రం జోరు తగ్గలేదు. ఈమె జోరు టాలీవుడ్ లో కూడా కంటిన్యూ అవుతోంది. రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న గేమ్ ఛేంజర్ సినిమా లో నటిస్తోంది. %ూశ్రీంశీ =ము౧% - అక్కడ కాక పుట్టిస్తోన్న కుర్రాళ్ల త్రయం! ఇంత బిజీగా ఉన్న కియారా అద్వానీ అందాల ఆరబోత విషయంలో తనకు తానే సాటి అన్నట్లుగా హాట్ ఫోటో షూట్స్ షేర్ చేస్తూ ఉంటుంది. మోడలింగ్ లో ఈ అమ్మడి సందడి అంతా ఇంతా కాదు. ఇక ఈ అమ్మడు కవర్ పేజీ ఫోటో స్టిల్స్ ఆహా ఓహొ అన్నట్లుగా ఉంటాయి అనడంలో కూడా సందేహం లేదు. తాజాగా ఈ ఫోటోతో ఫ్యాన్స్ మతి పోగొట్టినంత పని చేసింది. బ్లాక్ పాయింట్ తో బ్లూ జీన్స్ టాప్ తో క్లీ వేజ్ షో చేస్తూ మతి పోగొట్టింది. టైట్ జీన్స్ తో ఈ అమ్మడి అందాల ఆరబోత కు ప్రతి ఒక్కరు కూడా ఫిదా అవుతున్నారు. ఒక వైపు సినిమా ల్లో అందాల ఆరబోత చేస్తూ మరో వైపు ఇలా సోషల్ మీడియాలో అందాల విందు చేస్తూ తెగ హడావిడి చేస్తోంది.

## అప్సరను మించే అందమైన మౌనీ.. గ్లామర్ ట్రీట్



మౌనీరాయ్ అందరికీ సుపరిచితమే. ముందుగా హిందీ సీరియల్స్ లో తన కెరీర్ ని మొదలుపెట్టింది. అలానే అందరికీ పరిచయం అయ్యింది. ముఖ్యంగా నాగిని సీరియల్ లో ఆమె అందానికి అందరూ ఫిదా అయిపోయారు. నిజంగా నాగిని ఉంటే, తనలానే ఉంటుందా అనేలా తన నటనతో అలరించింది. ఆ తర్వాత నాగినీ కి సీక్వెన్స్ చాలా వచ్చాయి. కానీ, మౌనీ రాయ్ చూపించినంత గ్రేస్ ఇతర నటీమణులు చూపించలేకపోయారు. ఇలా, సీరియల్స్ లో మెప్పించిన తర్వాత ఆ క్రేజ్ తో సినిమాల్లోకి అడుగుపెట్టింది. రణవీర్, అలియా భట్ జంటగా నటించిన బ్రహ్మాస్త్ర మొదటి భాగంలో ఏకంగా విలన్ పాత్రలో నటించింది. ఈ అందమైన విలన్ కు అందరూ దాసోహమైపోయారు. ఈ మూవీతో ఆమె కేవలం ఉత్తరాది ప్రేక్షకులకు మాత్రమే కాకుండా, దక్షిణాది ప్రేక్షకులను కూడా అలరించింది. ఇక్కడ కూడా ఆమెకు ఫ్యాన్స్ పెరిగిపోయారు. %ూశ్రీంశీ =ము౧% - పిక్ టాక్ : టాప్ యాంగిల్ అందాలతో కియారా కాగా, మౌని రాయ్ సోషల్ మీడియాలో చాలా చురుకుగా ఉంటుంది. ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో తన ఫోటోలు షేర్ చేసి ఆకట్టుకుంటూ ఉంటుంది. తాజాగా బ్లాక్ కలర్ డ్రెస్ లో మెరిసింది. బ్లాక్ కలర్ మ్యాక్సీ డ్రెస్ కాగా, కోల్డ్ షోల్డర్స్ డిజైన్ చేసి ఉన్నాయి. ఈ డ్రెస్ ఆమె ఒంటికి అతుక్కుపోయి ఉంది. ఆమె సొగసులు స్పష్టంగా కనపడుతున్నాయి. ముఖ్యంగా ఆమె థైస్ మరింత ఆకర్షణీయంగా కనపడుతున్నాయి. ఇక, తన డ్రెస్ కి మ్యాచ్ అయ్యేలా బ్లాక్ కలర్ హై హీల్స్ ధరించింది. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి. లైకుల వర్షం కురిపిస్తున్నారు. హాట్ , క్యూట్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. కాగా, బ్రహ్మాస్త్ర తర్వాత మౌని రాయ్ కి ఆఫర్లు క్యూలు కడుతున్నాయి. ఇటీవల కేజీఎఫ్ లో ఓ స్పెషల్ సాంగ్ చేసి అలరించింది. ఇలాంటి మరిన్ని ఆఫర్లు ఆమెకు వస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, ఇండస్ట్రీలో చాలా కాలం నుంచి ఉంటున్నా, ఇంకా ఆమె అందానికి తగినంత గుర్తింపు మాత్రం రాలేదనే చెప్పాలి. మరి ఫ్యూచర్ లో ఆమెకు ఎలాంటి ఆఫర్లు వస్తాయో చూడాలి.



## జిగేల్ డ్రెస్సింగ్ డ్రెస్సింగ్‌లో జాన్వీ హొయలు





బాలీవుడ్ బ్యూటీ జాన్వీకి స్పెషల్ గా పరిచయం అవసరం లేదు. శ్రీదేవి కూతురిగా సినిమాల్లోకి రాకముందు నుంచీ పరిచయమే. ఆ హెూదాలోనే ఇండస్ట్రీలోనే అడుగుపెట్టింది. జాన్వీ తన సినీ కెరీర్ మొదలుపెట్టి ఐదేళ్లు అవుతోంది. అయితే, ఇప్పటి వరకు చెప్పుకోదగిన హిట్ మాత్రం అందుకోలేకపోయింది. తాజాగా, ఈ బ్యూటీ 'బవాల్'అనే మూవీలో నటించింది. ఈ మూవీలో ఆమెకు జోడిగా వరుణ్ ధావన్ నటించారు. సాజిద్ నడియద్ వాలా నిర్మించిన ఈ సినిమాకి, నితేశ్ తివారి దర్శకత్వం వహించాడు. డైరెక్ట్ గా ఓటీటీలో విడుదల కాగా, బాగానే ఆకట్టుకుంది. దక్షిణాదిన కూడా సత్తా చాటేందుకు ట్రై చేస్తోంది. %ూశ్రీంశీ =ము౧% - అక్కడ కాక పుట్టిస్తోన్న కుర్రాళ్ల త్రయం! కాగా, సోషల్ మీడియాలోనూ ఎప్పుడూ చురుకుగా ఉంటుంది. ఈ క్రమంలో ఆమె తాజాగా ఓ వీడియో విడుదల చేసింది. ఆ వీడియోలో ఆమె వివిధ రంగుల దుస్తుల్లో మెరిసిపోయింది. అన్నీ జిగేల్ జిగేల్ మనే దస్తులు కావడం విశేషం. ఈ వీడియో ఫ్యాన్స్ ని విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఒక్కో రంగు డ్రెస్ లో ఒక్కోలా ముస్తాబై, ఫోటోలకు ఫోజులు ఇవ్వడం విశేషం. ఇక, ఈ బ్యూటీ తెలుగులో దేవర మూవీతో గ్రాండ్ గా లాంఛ్ కాబోతోంది. తెలుగులో మొదటి సినిమానే ఆమెకు ఎన్టీఆర్ తో కలిసి నటించే అవకాశం రావడం విశేషం. ఈ సినిమా వచ్చే ఏడాది సమ్మర్ లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మూవీలో సైఫ్ అలీఖాన్ విలన్ గా నటిస్తున్నాడు. ఈ మూవీలో జాన్వీ లుక్ ని గతంలోనే రివీల్ చేశారు. ఈ మూవీలో ఆమె డీగ్లామర్ లుక్ లో కనిపిస్తుందని తెలుస్తోంది. ఇదిలా ఉండగా, మరో వైపు ఈ బ్యూటీ తమిళంలోనూ అడుగుపెట్టాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఓ సినిమా ఒకే అయినట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.బ్యాలెన్స్ గా అటు తెలుగులోనూ, ఇటు తమిళంలోనూ తన కెరీర్ ని కంటిన్యూ చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. వరసగా, రెండు హిట్లు పడితే, ఇక దక్షిణాదిన జాన్వీ కెరీర్ కి ఎలాంటి దోకా లేదనే చెప్పొచ్చు.

PRINTED,PUBLISHED, OWNED BY TEHELKA MEDIA NETWORK , DIGITAL NEWS .Regd no : 2019/ 28814 ,EDITOR: K.CHANDRA SHEKHAR,
EXCUTIVE EDITOR : K. SRINIVAS RAO,G6,Madhuranagar,yousufguda,HYDERABAD-500045.e-mail:Tehelkamedianetworks@gmail.com